ఈనాడు
కాకినాడ
బుధవారం సెప్టెంబరు 25, 2024 5

నెయ్యిపై నిర్ణయమెటు?
అన్నవరంలో ముగియనున్న గడువు

అన్నవరం: అన్నవరం సత్యదేవుని ప్రసాదం తయారీకి వినియోగించే నెయ్యి కొనుగోలుపై అధికారులు ఎటువంటి నిర్ణయం తీసుకుంటారన్నదానిపై చర్చ నడుస్తోంది. తిరుమల లడ్డూ తయారీకి నాసిరకం నెయ్యి వాడకం సంచలనమైన నేపథ్యంలో అన్నవరంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని నిర్ణయించారు. కొనుగోలుపై త్వరలోనే దేవాదాయశాఖ నుంచి ప్రత్యేకంగా మార్గదర్శకాలు వచ్చే అవకాశముందని చెబుతున్నారు. ప్రసాదం తయారీకి ప్రస్తుతం రైతు డెయిరీ నుంచి కేజీ రూ.538.60 కి సరఫరా అవుతోంది. ఏడాదికి సుమారు 2 లక్షల


దేవస్థానంలో ప్రసాదం తయారీ కేంద్రం

కేజీలు దేవస్థానం తీసుకుంటుంది. సరఫరాకు ప్రతి ఆరునెలలకు టెండర్లు పిలుస్తుండగా గత నాలుగుసార్లు (2022 అక్టోబరు నుంచి 2024 సెప్టెంబరు వరకు) టెండర్లు దక్కించుకున్న రైతుడెయిరీ గడువు ఈ నెలాఖరుతో ముగుస్తుంది. అక్టోబరు 1 నుంచి కొత్త టెండర్‌లో కేజీ నెయ్యి రూ.484.50కు సరఫరా చేసేందుకు ఓ గుత్తేదారు ముందుకు వచ్చారు. అధికారికంగా ఖరారు చేయాల్సి ఉంది. ప్రస్తుత గుత్తేదారు గడువు మరో ఆరురోజుల్లో ముగుస్తుండటంతో కొత్త వ్యక్తికి అనుమతి ఇస్తారా... లేదా ప్రత్యామ్నాయం ఆలోచిస్తారా... దేవాదాయశాఖ ఇచ్చే మార్గదర్శకాల కోసం వేచి చూస్తారా అన్నదానిపై సందిగ్ధత నెలకొంది.

తహసీల్దార్లకు స్థాన చలనం

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: సాధారణ బదిలీల్లో భాగంగా ముగ్గురు తహసీల్దార్లకు స్థాన చలనం కల్పించగా, ఒక స్పెషల్ డిప్యూటీ తహసీల్దారుకు పూర్తి అదనపు బాధ్యతలతో పోస్టింగ్ ఇచ్చారు. ఈ మేరకు కలెక్టర్ షాన్ మోహన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాకినాడ ఆర్డీవో కార్యాలయంలో పరిపాలనాధికారిగా పనిచేస్తున్న పితాని త్రినాథరావును తాళ్లరేవు తహసీల్దారుగా నియమించారు. కరప తహసీల్దారు పీవీవీ గోపాలకృష్ణను పిఠాపురంలో, పిఠాపురం తహసీల్దారు ఎస్ఎల్ఎన్ కుమారిని కాకినాడ గ్రామీణ మండలానికి నియమించారు. కాకినాడలోని భూసంస్కరణ విభాగంలో స్పెషల్ డిప్యూటీ తహసీల్దారుగా పనిచేస్తున్న ఎన్ సత్యనారాయణను కరప తహసీల్దారు(పూర్తి అదనపు బాధ్యతలు)గా నియమించారు.

వరించిన పదవులు

7 కార్పొరేషన్లలో 14 మందికి చోటు

ఈనాడు, కాకినాడ- న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్, పెద్దాపురం: ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడిన తెదేపా- జనసేన- భాజపా నేతలకు కూటమి ప్రభుత్వం సముచిత స్థానం కల్పించింది. రాజకీయ, సామాజిక సమీకరణాల ఆధారంగా 7 కార్పొరేషన్లలో 14 మందికి ఉమ్మడి జిల్లా నుంచి నామినేటెడ్ పదవుల్లో అవకాశమిచ్చింది.

■ కార్పొరేషన్ల సభ్యులుగా..

◆ ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సభ్యులుగా రాజమహేంద్రవరానికి చెందిన తెదేపా నేత యర్రా వేణుగోపాలరాయుడు ..ఏపీ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ సభ్యులుగా రాజమహేంద్రవరం మాజీ డిప్యూటీ మేయర్ [illegible] రాంబాబు, జనసేన నేత జి.స్వరూపాదేవికి అవకాశం దక్కింది.

■ పద్మశాలి కార్పొరేషన్‌లో స్థానం

గొల్లప్రోలు: పద్మశాలి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్‌లో పిఠాపురం నియోజకవర్గానికి ప్రాధాన్యం లభించింది. గొల్లప్రోలు మండలం దుర్గాడకు చెందిన బేతా సత్యనారాయణ (తెదేపా), చేబ్రోలుకు చెందిన సూరిశెట్టి జయనాగకృష్ణ (జనసేన)లను డైరెక్టర్లుగా నియమించారు. సత్యనారాయణ తెదేపాలో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్నారు. చేనేత సొసైటీ, కేంద్ర ప్రభుత్వ చేనేత సహకార సంఘంలో సభ్యత్వం పొందారు. జయనాగకృష్ణ జనసేన ఆవిర్భావం నుంచి కార్యకర్తగా కొనసాగుతూ ప్రస్తుతం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శిగా ఉన్నారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటం సాగిస్తున్నారు. అలాగే రాజమహేంద్రవరం తెదేపా నేతలు హరికిషోర్, మత్స్యేటి సత్యప్రసాద్‌లు సభ్యులుగా నియమితులయ్యారు.


బేతా సత్యనారాయణ


సూరిశెట్టి జయనాగకృష్ణ

పౌరసరఫరాలు గాడిన పడేనా..


పవన్‌తో సుధీర్

◆ రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ ఛైర్మన్‌గా కాకినాడ సిటీ నియోజకవర్గానికి చెందిన జనసేన నేత తోట మెహర్ సీతారామ సుధీర్ నియమితులయ్యారు. సభ్యులుగా కాకినాడ సిటీ జనసేన నాయకురాలు కదలి ఈశ్వరి, ముమ్మిడివరం తెదేపా నేత మోకా ఆనంద్ సాగర్, పెద్దాపురం నియోజకవర్గ భాజపా నేత తుమ్మల పద్మజలను నియమించారు. పద్మజ కాకినాడ పట్టణ భాజపా మహిళా మోర్చా అధ్యక్షురాలు, పెద్దాపురం నియోజకవర్గం భాజపా ఇన్‌ఛార్జి, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యురాలు, కార్యదర్శి, ఉపాధ్యక్షురాలు, రాష్ట్ర అధికార ప్రతినిధిగా పనిచేశారు. ప్రస్తుతం భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా ఉన్నారు.


కదలి ఈశ్వరి

ఒకే కార్పొరేషన్‌లో నలుగురికి..

మంత్రి నాదెండ్ల మనోహర్ పౌరసరఫరాల వ్యవస్థను గాడిలో పెడతానని ప్రకటించడం.. కాకినాడ కేంద్రంగా సాగుతున్న రేషన్ మాఫియాను కట్టడి చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈక్రమంలో ఛైర్మన్‌గా సుధీర్, ఉమ్మడి జిల్లా నుంచి నలుగురికి ఈ కార్పొరేషన్‌లో అవకాశం ఇవ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది. వైకాపా పాలనలో కాకినాడను వేదికగా చేసుకుని పూడి భాస్కరరెడ్డి రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్‌గా వ్యవహరించారు. ఈసారి ఆ పదవి కాకినాడకే జనసేన నాయకునికి దక్కింది. ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్‌కు సుధీర్ బంధువవుతారు. ◆ పేదల బియ్యం అక్రమ రవాణాను అడ్డుకుంటామని సుధీర్ అన్నారు. ధాన్యం సేకరణ పటిష్ఠంగా చేపట్టి కనీస మద్దతు ధర అందేలా కృషిచేస్తానన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం అమ్మిన రైతులకు సకాలంలో సొమ్ములు జమయ్యేలా చొరవ చూపుతానన్నారు.


తుమ్మల పద్మజ లక్ష్మి


యు.కొత్తపల్లిలో నిర్మాణ దశలో ఉన్న హోటల్ మేనేజ్‌మెంట్ విద్యా సంస్థ భవనం

పుష్కరమైంది.. పలుకుతారా!

- వైకాపా నేతల నిర్వాకంతో కేంద్ర విద్యా సంస్థపై నీలినీడలు
- గుత్తేదారుకు బిల్లులు ఇవ్వక ఆగిన పనులు

ఈనాడు, కాకినాడ, న్యూస్‌టుడే, కొత్తపల్లి

వందల మంది విద్యార్థులకు వివిధ కోర్సులతో స్వయం ఉపాధి చూపాల్సిన సంస్థ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ (ఎస్ఐహెచ్ఎం)... కాకినాడ జిల్లాకు కేటాయించిన ఈ విద్యాసంస్థపై కేంద్రం కరుణించినా .. అక్కడి స్థలంలో రాజకీయం వేలు పెట్టడంతో కొన్నాళ్లు పడకేసింది. అడ్డంకులు తొలగాక పనులు చేస్తున్న గుత్తేదారుకు వైకాపా సర్కారు బిల్లులు ఆపేయడంతో నీలి నీడలు కమ్మేశాయి.

వీడని చిక్కుముళ్లు..

యు.కొత్తపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల పక్కనే అయిదెకరాల ఖాళీ స్థలంలో తెదేపా ప్రభుత్వం 2014లో శంకుస్థాపన చేసింది. రూ. 1.50 కోట్లు ఖర్చుచేసి పనులు ప్రారంభించాక పిల్లల ఆట స్థలంలో నిర్మాణాలేమిటని అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. వైకాపా నాయకులు న్యాయస్థానాన్ని ఆశ్రయించి స్టే తేవడంతో పనులు ఆగాయి. వైకాపా ప్రభుత్వం వచ్చాక చిక్కులు తొలగించుకున్నా.. ప్రాజెక్టు కొలిక్కిరాలేదు. చేసిన పనులకు రూ.2 కోట్ల బిల్లులు ఇవ్వలేదని గుత్తేదారు ఆపేశారు.

నైపుణ్య వికాసానికి గ్రహణం..

జాతీయ విద్యా ప్రవేశ నిబంధనలు అనుసరించి కౌన్సిల్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్-క్యాటరింగ్ టెక్నాలజీ సంయుక్తంగా ప్రవేశ పరీక్షల ద్వారా కోర్సులకు అవకాశం కల్పించాలి. విద్యాసంస్థ పూర్తయితే మూడేళ్ల బీఎస్సీ డిగ్రీ.. ఆహార ఉత్పత్తి, ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీసు, హౌస్ కీపింగ్, ఆఫీస్ ఆపరేషన్స్‌లలో ఏడాదిన్నర వ్యవధితో ట్రేడ్ డిప్లమో కోర్సులూ వస్తాయి. డిగ్రీ కోర్సుకు 80 సీట్లు. . డిప్లమో కోర్సులకు 40 చొప్పున 280 సీట్ల భర్తీ చేయొచ్చు. తిరుపతిలో నిర్మాణం పూర్తయి నడుస్తుంటే.. మనవద్ద పుష్కర కాలంగా ఎదురుచూపులే.

సంస్థ: స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ (ఎస్ఐహెచ్ఎం)
అంచనా వ్యయం రూ.12 కోట్లు
పథకం మంజూరు 07.01.2013
నిర్మాణం పూర్తికి గడువు: 07.01.2016
పనుల ప్రగతి: తరగతి గదులు, పాలన భవనాలు కొలిక్కిరాలేదు. విద్యార్థుల వసతిగృహ నిర్మాణం పునాది స్థాయిలో ఉంది. మౌలిక వసతులు లేవు.

కూటమి ప్రభుత్వం ఊతమిస్తేనే..

హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల నిర్మాణానికి కేంద్రం మంజూరుచేసిన నిధుల్లో.. తరగతుల నిర్వహణ, పరిపాలన భవనాలకు రూ.8 కోట్లు.. వసతిగృహ సముదాయానికి రూ.2 కోట్లు.. బోధన సామగ్రి, ఇతర వనరులకు రూ.2 కోట్ల చొప్పున వెచ్చించాలి. ఇప్పటివరకు చేసిన పనులకు రూ.4 కోట్లు మంజూరైతే.. మరో రూ.2 కోట్లు బిల్లులు రావాలి. గోడలు, ప్లాస్టరింగ్, ఫ్లోర్, విద్యుత్తు వైరింగ్ ఆగిపోయాయి. భవన నిర్మాణాలు పూర్తయ్యాక రోడ్లు, మురుగు పారుదల వ్యవస్థ, చుట్టూ వీధి దీపాలు సమకూర్చాలి. వైకాపా ప్రభుత్వం గత అయిదేళ్లలో శ్రద్ధ చూపలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం నిధుల విడుదలకు చొరవచూపి విద్యాసంస్థను అందుబాటులోకి తేవాలన్న ఆకాంక్ష వ్యక్తమవుతోంది.


పునాది దశ దాటని విద్యార్థుల వసతి భవన ప్రాంగణం

మింగేసిన మృత్యువు

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు యువకుల దుర్మరణం

ఆలమూరు, న్యూస్‌టుడే: తండ్రి చనిపోవడంతో తల్లికి ఆసరాగా నిలిచినవారు ఒకరైతే.. భార్య, ముద్దులొలికే ఇద్దరు చిన్నారులతో హాయిగా జీవితాన్ని సాగించే వ్యక్తి మరొకరు..ఎంతో భవిష్యత్తు ఉన్న యువకుడు ఇంకొకరు.. ఈ ముగ్గురూ మంగళవారం రోడ్డు ప్రమాదాల్లో దుర్మరణం చెందడంతో ఆయా కుటుంబాల్లో చీకట్లు అలముకున్నాయి.


సీతారామరాజు


రాజేష్

ఆలమూరు మండలంలోని చొప్పెల్ల గ్రామానికి చెందిన వానపల్లి రాజేష్ (30), కడియం మండలం దుళ్ల గ్రామానికి చెందిన వేగిరాజు సీతారామరాజు(36) వెల్డింగ్ పనుల నిమిత్తం రావులపాలెం వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంపై తమ స్వగ్రామాలకు వెళ్తున్నారు. మంగళవారం సాయంత్రం జొన్నాడ ఏటిగట్టుకు వచ్చేసరికి అదే మార్గంలో మత్స్యకారుల వాహనం కపిలేశ్వరపురం వైపు మలుపు తిరుగుతోంది. ఇది గమనించని వీరు ద్విచక్ర వాహనంతో వెనుక నుంచి బలంగా ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుల్లో ఒకరైన రాజేష్ ఇటుకబట్టీ నిర్వహిస్తున్నారు. తండ్రి చనిపోగా తల్లికి అతనే ఆధారం. ఇంకా వివాహం కాలేదు. మరో మృతుడు సీతారామరాజుకు భార్య, ఆరోతరగతి చదువుతున్న కుమారుడు, నాలుగోతరగతి చదివే కుమార్తె ఉన్నారు. తండ్రి డయాలసిస్ రోగి కావడంతో కుటుంబ బాధ్యత సీతారామరాజు చూసుకుంటున్నాడు. ఇప్పుడు కుటుంబానికి దిక్కెవరంటూ వారంతా రోదిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై ఎం.అశోక్ తెలిపారు.

శునకం అడ్డురావడంతో..

అమలాపురం పట్టణం: అమలాపురంలోని నల్లవంతెన ప్రాంతానికి చెందిన కుంచే సురేష్‌కుమార్(28) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారని పట్టణ సీఐ వీరబాబు తెలిపారు. మంగళవారం ఉదయం కాలేజీ రోడ్డులో ద్విచక్ర వాహనంపై వెళుతున్న సురేష్‌కు కుక్క అడ్డురావడంతో పడిపోయారు. కాకినాడకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారని, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇళ్ల నిర్మాణాల పూర్తికి ఆదేశం

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలను అక్టోబరు నెలాఖరుకు పూర్తి చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. స్లాబ్ స్థాయి ఇళ్లను త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. 2014-19 మధ్య ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం ద్వారా చేపట్టిన ఇళ్ల సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆ లబ్ధిదారులకు త్వరలో ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుందన్నారు. గురుకుల విద్యాలయాలు, సంక్షేమ వసతి గృహాల్లో నీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ ప్రక్రియను అక్టోబరు 15 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. సోమ, గురువారాల్లో సచివాలయాల సిబ్బంది మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. జిల్లా గృహ నిర్మాణ అధికారి ఎన్‌వీవీ సత్యనారాయణ, డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, డీఈవో పి.రమేశ్, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, జడ్పీ సీఈవో(ఇన్‌ఛార్జి) పి.నారాయణమూర్తి, పంచాయతీరాజ్ ఎస్ఈ మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.


సమీక్షిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్, హాజరైన అధికారులు

అభ్యర్థులు నేడు హాజరు కావాలి

మసీదుసెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ (మేల్) ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన పలువురు అభ్యర్థులు తమను విధుల నుంచి తొలగించారని హై కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు సంబంధిత అభ్యర్థులు స్వయంగా ధ్రువపత్రాలతో ఈ నెల 25న కాకినాడ డీఎంహెచ్‌వో కార్యాలయానికి హాజరు కావాలని డీఎంహెచ్‌వో డా.నరసింహానాయక్ ఓ ప్రకటనలో తెలిపారు.

ఆర్టీసీ రయ్.. రయ్..

దూరప్రాంత మార్గాల్లో రోడ్డెక్కిన కొత్త బస్సులు

న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

ఆర్టీసీకి కొత్త బస్సులు వచ్చాయి. ఎక్కువ వాహనాలను దూర ప్రాంత సర్వీసులుగా నడపనున్నారు. పండగలు, ప్రత్యేక రోజుల్లో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించే వారిని ఆకర్షించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. గత నెల రోజుల వ్యవధిలో విడతల వారీగా జిల్లాకు 22 కొత్త బస్సులను కేటాయించారు. త్వరలో మరో 20 రావొచ్చని డిపో అధికారులు తెలిపారు.

వైకాపా పాలనలో నిర్లక్ష్యం..

వైకాపా పాలనలో అత్యవసరమైనా కొత్త బస్సులు సమకూర్చలేదు. మరో వైపు అయిదేళ్లలో మూడుసార్లు బస్ ఛార్జీలను పెంచి ప్రయాణికులపై భారం మోపారు.

దూర ప్రాంత సర్వీసులుగా..

తాజాగా జిల్లాకు వచ్చిన 22 కొత్త బస్సుల్లో 20 సూపర్ లగ్జరీ, 2 నాన్ ఏసీ స్లీపర్ బస్సులు ఉన్నాయి. వీటిలో తుని డిపోకు 2 నాన్ ఏసీ స్లీపర్లు కేటాయించారు. వీటిని హైదరాబాద్ మార్గంలో తిప్పనున్నారు. ఏలేశ్వరం డిపోకు ఒక సూపర్ లగ్జరీ బస్సు కేటాయించారు. దీనినీ హైదరాబాదులో రూటులో తిప్పుతున్నారు. కాకినాడ డిపోకు కేటాయించిన బస్సులను విజయవాడ, శ్రీశైలం, అనంతపురం, హైదరాబాదు వంటి దూర ప్రాంతాలకు తిప్పుతున్నారు.


సూపర్ లగ్జరీ బస్సు

ప్రయాణికుల సంఖ్య పెంచే దిశగా..

మరిన్ని బస్సులు ఆయా డిపోలకు రానుండటంతో ఆదాయం పెంపుపై దృష్టి సారిస్తున్నారు. సరిపడా ఆర్టీసీ బస్సులు లేక పండగల సమయంలో ఎక్కువ సంఖ్యలో ప్రయాణికులు ప్రైవేటు బస్సులను ఆశ్రయిస్తున్నారు. ఇప్పుడు ఆర్టీసీ వైపు వస్తారని అధికారులు చెబుతున్నారు. దీనిపై జిల్లా ప్రజారవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ కాలం చెల్లిన పల్లె వెలుగు బస్సుల స్థానంలో ఇప్పుడు నడుస్తున్న లగ్జరీ బస్సులను ఏర్పాటు చేస్తామన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఎక్కువ మంది ప్రయాణించేలా ప్రణాళికలు సిద్ధం చేశామని పేర్కొన్నారు.

జిల్లాలో పరిస్థితి

డిపోలు:	మొత్తం బస్సులు:	ప్రయాణ దూరం:	ప్రయాణికులు:
కాకినాడ, తుని, ఏలేశ్వరం	288	1.12 లక్షల కి.మీ.	82 వేల మంది; రోజుకు ఆదాయం: రూ.50 లక్షలు

రూ.వెయ్యి కోట్లతో ఏలేరు ఆధునికీకరణ
చీఫ్ ఇంజినీరు పుల్లారావు

కిర్లంపూడి, జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా ఏలేరు ఆధునికీకరణను రెండు దశల్లో చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసిందని జలవనరులశాఖ చీఫ్ ఇంజినీరు ఎన్.పుల్లారావు తెలిపారు. ఏలేరు వరదలకు దెబ్బతిన్న గట్లను, సాగునీటి నిర్మాణాలను జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూతో కలిసి జలవనరుల శాఖ అధికారులు మంగళవారం పరిశీలించారు. సీఈ పుల్లారావు మాట్లాడుతూ.. ఆధునికీకరణలో భాగంగా రూ. 300 కోట్లు భూసేకరణకు అవసరమన్నారు. ఇటీవల ఏలేరు వరదలకు ఆయకట్టు ప్రాంతంలో 275 వరకు గండ్లు పడ్డాయన్నారు. ఏలేరుపై ఓపెన్ హెడ్ చానల్స్ వల్ల ప్రాజెక్టును ఉంచి ఎక్కువ నీటిని వదిలితే గాని చివరి ఆయకట్టు వరకు సాగునీరు చేరడం లేదని ఆధునికీరణతో ఈ సమస్య ఉండదన్నారు. వరద నీటిని పూర్తి సామర్థ్యంతో గ్రామాలకు, పంటలకు నష్టం వాటిల్లకుండా సముద్రంలో కలిసేలా ప్రస్తుతం ఉన్న వరద కాలువల సామర్థ్యంపై సర్వే నిర్వహించాలని ఆదేశించామన్నారు. కాలువలకు సంబంధించి ప్రభుత్వ భూమి ఎంత అందుబాటులో ఉంది. ఎంత అవసరం అనే విషయమై సర్వే జరుగుతుందని సీఈపుల్లారావు తెలిపారు. ఆయన వెంట ఎస్ఈ శ్రీనివాసరావు, ఏలేరు ఇన్‌ఛార్జి ఈఈ శేషగిరిరావు, డీఈలు, ఏఈలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


ఇర్రిపాక వద్ద ఏలేరు వరదలతో కోతకు గురైన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ, సీఈ పుల్లారావు

క్యాన్సర్ చికిత్స విధానాలపై అవగాహన

మసీదుసెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ జీజీహెచ్‌లో నిర్వహిస్తున్న గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ రెండో రోజు మంగళవారం కొనసాగింది. గర్భాశయ క్యాన్సర్ చికిత్సా విధానాలను పీజీ విద్యార్థులకు జీన్ టాల్బర్ట్ ఫాకోగ్, డా.సమత కడియాల వివరించారు. మంగళవారం 72 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు.

న్యాయం జరిగే వరకు పోరాటం

మసీదుసెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: వైద్యుడిపై జరిగిన దాడి ఘటనలో న్యాయం జరిగే వరకు పోరాడుతామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు డా. జయధీర్ తెలిపారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘం, ఆర్ఎంసీ జూడాల ఆధ్వర్యంలో ఆర్ఎంసీ మైదానం నుంచి ఎస్పీ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. వైద్యుడిపై దాడిచేసిన వారిని శిక్షించాలంటూ నినాదాలు చేశారు. అనంతరం ఎస్పీకి వినతిపత్రం అందజేశారు. ఏపీజీడీఏ సంఘ నాయకులు డా.ప్రసన్నకుమార్, డా.పాండురంగ విఠల్, డా.వీరయ్య, ఆర్ఎంసీ జూడాల అధ్యక్షుడు డా.మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్ఎంసీ మైదానంలో వైద్యులు, విద్యార్థులు

విద్యతోనే సాధికారత

సర్పవరం జంక్షన్, న్యూస్‌టుడే: తిమ్మాపురంలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం కాకినాడ ఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్‌లో మంగళవారం మహిళా సాధికారత అంశంపై సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ ప్రశాంతిశ్రీ అధ్యక్షతన జరిగిన సదస్సులో ఓఎన్జీసీ మహిళా అధికారుల సమితి అధ్యక్షురాలు శ్వేతాసింగ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యతోనే ఆర్థిక సాధికారత సాధ్యమన్నారు. చీఫ్ మేనేజర్ డాక్టర్ మణి, అధ్యాపకులు పోచయ్య, రాధామాధవి, నానిబాబు, గోపి, అజయ్‌రతన్, విద్యార్థులు పాల్గొన్నారు.


సదస్సును ప్రారంభించిన ప్రిన్సిపల్ ప్రశాంతిశ్రీ, మహిళా ప్రతినిధులు

అన్నవరంలో భారీ వర్షం

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరంలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సుమారు గంటపాటు ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి సత్య, రత్నగిరుల రహదారులపై నీరు ప్రవహించింది. మెట్లమార్గంలో ప్రవహించిన నీరు చూపరులను ఆకట్టుకుంది.


తూర్పురాజగోపురం ఎదురుగా మెట్లపై నుంచి ప్రవహిస్తున్న నీరు

తిరుమల లడ్డూ అపవిత్రతపై ఆగ్రహం

గాంధీనగర్, న్యూస్‌టుడే: తిరుమల వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వులు, ఇతర పదార్థాలు కలిపి అపవిత్రతకు పాల్పడిన వారిని ఉరి తీయాలని హిందూ సంఘాలు, కూటమి నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం రాత్రి సంతచెరువు కామాక్షీ ఆలయం వద్ద విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చెల్లూరి సత్యనారాయణ అధ్యక్షతన హిందూ సంఘాలు, కూటమి నాయకులు కాగడాల ప్రదర్శన నిర్వహించారు. సంతచెరువు చుట్టూ ఉన్న ఆలయాల వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో చెల్లూరి సత్యనారాయణ, భాజపా నేత యెనిమిరెడ్డి మాలకొండయ్య, విశ్వబ్రాహ్మణ సంఘ నాయకుడు ఆవుపాటి ఉమాశంకర్, చెక్కా రమేష్, విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘ నాయకుడు పుట్టా భాస్కరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.


కాగడాలతో నిరసన తెలుపుతున్న కూటమి నాయకులు, హిందూ సంఘాలు



మూలపాలంలో వరి దుబ్బు పరిశీలిస్తున్న విజయకుమార్

రైతు సాధికారత.. సంక్షేమమే లక్ష్యం

తాళ్లరేవు, న్యూస్‌టుడే: రైతు సాధికారత, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని జిల్లా వ్యవసాయాధికారి ఎన్.విజయకుమార్ అన్నారు. పి.మల్లవరం పంచాయతీ పరిధిలోని మూలపొలంలో మండల వ్యవసాయాధికారిణి ఎన్.ప్రశాంతి ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని విజయకుమార్ మంగళవారం ప్రారంభించారు. వ్యవసాయంలో వస్తున్న మార్పులను రైతులు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. వరి పొలంలోని దుబ్బులు పరిశీలించారు. మూలపొలం, పటవల, తాళ్లరేవులో ఎలుకల నివారణ మందు మిశ్రమాన్ని పొట్లాలు కట్టి రైతులకు అందించారు. వ్యవసాయశాఖ ఏడీ బాబూరావు, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ, కాకినాడ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ వుంగరాల వెంకటేశ్వర రావు, ఉపసర్పంచి పంపన రామకృష్ణ, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజుబాబు, గంజా సూరిబాబు, రాయుడు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలు తెరపైకి..
నిందితులు దొరికేనా..?

డీసీసీబీలో బయటపడుతున్న వైకాపా పాలన నాటి మోసాలు

న్యూస్‌టుడే, గాంధీనగర్(కాకినాడ)

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ)లో వైకాపా హయాంలో జరిగిన అక్రమాలు ఒక్కొక్కటి వెలుగు చూస్తున్నాయి. అప్పట్లో ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ఇష్టానుసారంగా రుణాలు మంజూరు చేశారు. దస్త్రాలు సక్రమంగా నిర్వహించలేదు. సొసైటీలు, బ్యాంకు శాఖల్లో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నా బ్యాంకు ఉన్నతాధికారుల నుంచి స్పందన లేదని ఉద్యోగ సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

డీసీసీబీ కాకినాడ కేంద్రంగా ఉమ్మడి జిల్లాలో 299 సొసైటీలు, 52 బ్యాంకు బ్రాంచిల ద్వారా సేవలందిస్తోంది. సుమారు రూ.5వేల కోట్ల టర్నోవర్ ఉంది. వైకాపా పాలనలో బ్యాంకు, సొసైటీలకు ఎన్నికలు నిర్వహించకుండా కమిటీలతో నడిపించారు. అందులో వైకాపా వీరభక్తులకు అవకాశం కల్పించడంతో వారు ఇష్టానుసారంగా వ్యవహరించారు. బ్యాంకు బ్రాంచులు, సొసైటీల్లో ఇచ్చే రుణాల విషయంలో నిబంధనలకు నీళ్లొదిలినా ఉన్నతాధికారులు, పాలకవర్గ కమిటీలు పట్టించుకోలేదు.



డీసీసీ బ్యాంకు

మచ్చుకు కొన్ని..

● డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని కె.గంగవరం బ్రాంచిలో సుమారు రూ.కోటి పైబడి అక్రమాలు జరిగినట్లు సమాచారం. అక్కడ సంబంధిత ఉద్యోగులను సస్పెండ్ చేశారు. వారి నుంచి సుమారు రూ.50 లక్షలు రికవరీ చేశారు. ప్రత్యేక ఫోరెన్సిక్ ఆడిట్‌ను నిర్వహిస్తున్నారు. ● ఆలమూరు బ్రాంచి పరిధిలోని చింతలూరు పీఏసీఎస్‌లో రూ.70 లక్షల వరకు బాండ్లు లేకపోవడం, షేర్ క్యాపిటల్ దుర్వినియోగం జరిగిన ఉదంతం ఇటీవల వెలుగులోకి వచ్చింది. దీనిపై శాఖాపరంగా 51 విచారణ నిర్వహించారు. ● కాకినాడ జిల్లా ఎస్.అన్నవరం పీఏసీఎస్‌లో రూ.కోటికి పైగా అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. దీనిపైనా 51 విచారణ జరిపారు. ● జగ్గంపేట మండలం రాజపూడి సొసైటీలో వైకాపా పాలనా సమయంలో సుమారు రూ.అరకోటి వరకు అక్రమాలు వెలుగు చూసినట్లు సమాచారం. దీనిపై జగ్గంపేట బ్రాంచి మేనేజర్, సూపర్‌వైజర్లు నివేదిక ఇచ్చినా డీసీసీబీ ఉన్నతాధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించారన్న ఆరోపణలున్నాయి.

విచారణకు ఆదేశించాం..

ఒకే ఏడాది రుణాల్లో 20 శాతం ఓవర్ డ్యూలోకి వెళ్లడంతో వివరణ అడుగుతున్నాం. అక్రమాలు జరిగినట్లు గుర్తించిన సంబంధిత బ్రాంచి మేనేజర్లు, సూపర్‌వైజర్ల ప్రాథమిక నివేదిక ఆధారంగా సహకార శాఖను వివరణ కోరాం. దీనిపై డీసీఓ శాఖాపరంగా 51 విచారణకు ఆదేశించారు. అక్రమాలు జరిగినట్లు తేలితే సంబంధిత ఉద్యోగులపై చర్యలు తీసుకుంటాం.

- ఆర్‌వీ నరసింహారావు, డీసీసీబీ సీఈవో

శ్రీమురహరికి కన్నీటి వీడ్కోలు

మసీదు సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదానికి గురై బ్రెయిన్ డెడ్ అయిన పోలిశెట్టి రేవంత్ శ్రీమురహరి(19) నుంచి అవయవాలు స్వీకరించిన అనంతరం మృతదేహాన్ని మంగళవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆ యువకుడి మూత్రపిండాలు, కాలేయం గ్రీన్ ఛానెల్ ద్వారా సోమవారం వారం రాత్రి విశాఖపట్నం తరలించిన విషయం తెలిసిందే. మంగళవారం ఉదయం మృతదేహానికి అపోలో ఆసుపత్రిలో జీజీహెచ్ ఫోరెన్సిక్ వైద్యనిపుణుల ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం అతడి కుటుంబ సభ్యులు స్వగ్రామం పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం మండలం తోకలపూడి తరలించారు. మృతదేహాన్ని చూసిన మృతుని బంధువులు, ఆసుపత్రి సిబ్బంది కన్నీటిపర్యంతమయ్యారు.



ఆసుపత్రి నుంచి మృతదేహం తరలింపు

13,677 మందికి ఓటు హక్కు

● ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ముసాయిదా జాబితా ప్రచురణ ● నమోదుకు మళ్లీ అవకాశం


న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజక వర్గం ముసాయిదా ఓటర్ల జాబితా మంగళవారం ప్రకటించారు. ఆ జాబితాను ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారి డి.తిప్పే నాయక్ విడుదల చేశారు. జులై 29 నుంచి దరఖాస్తులు స్వీకరించారు. 14,191 మంది దరఖాస్తు చేయగా, వివరాలు సక్రమంగా ఉన్న 13,677 మందికి ఓటు హక్కు కల్పించారు. ఇందులో 8,062 మంది పురుషులు, 5,613 మంది మహిళలు, ఇద్దరు ఇతరులు ఉన్నారు.

ఆరు జిల్లాల పరిధి..

ముసాయిదా జాబితాను తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాల్లో ప్రదర్శించారు. ఈ నియోజక వర్గం పరిధిలో కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు, అల్లూరి సీతారామ రాజు జిల్లాలు ఉన్నాయి.

అక్టోబరు 15 వరకు..: మంగళవారం నుంచి అక్టోబరు 15 వరకు ఓటు నమోదుకు మళ్లీ అవకాశం కల్పించారు. తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు.



కాకినాడ కలెక్టరేట్‌లో ఓటు నమోదుకు వచ్చిన దరఖాస్తులను సమర్పిస్తున్న రెవెన్యూ అధికారులు (దాచిన చిత్రం)

అభ్యంతరాల స్వీకరణ

ముసాయిదా జాబితాపై వచ్చిన అభ్యంతరాలను అక్టోబరు 30లోగా పరిష్కరిస్తారు. తుది ఓటర్ల జాబితాను నవంబరు 6న ప్రచురించనున్నారు. అనంతరం ఈ నియోజకవర్గ ఎన్నికల ప్రకటన విడుదల చేసే అవకాశం ఉంది. మరింత సమాచారం, సహాయం కోసం 1950 టోల్‌ఫ్రీ నంబరు, కాకినాడ కలెక్టరేట్‌లోని ఈఆర్వో కార్యాలయంలో సంప్రదించవచ్చు.

ముసాయిదా ఓటర్ల జాబితా వివరాలివీ..

జిల్లా	పురుషులు	మహిళలు	ఇతరులు
కాకినాడ	1,723	1,279	1
తూర్పుగోదావరి	1,288	1,080	0
అంబేడ్కర్ కోనసీమ	1,745	889	0
అల్లూరి సీతారామరాజు	288	191	0
ఏలూరు	1,264	1,010	0
పశ్చిమగోదావరి	1,754	1,164	1

ఆకుల్లో కలసి.. శత్రువులను ఏమార్చి



శరీరం రంగులను మార్చుకోవడంలో ఊసరవెల్లి తనకు తానే సాటి.. రహదారిపై ఉన్న సమయంలో ముదురు ఆకుపచ్చ రంగుల చారలతో కనిపిస్తుంది. అదే మొక్కల పైకి వెళ్లినపుడు మనం గుర్తించలేనట్లుగా పూర్తిగా ఆకులో ఆకుపచ్చ రంగులోకి మారి తనని రక్షించుకోవడం విశేషం. తుని మండలం నందివంపు సమీపంలో రోడ్డుపక్కన మంగళవారం 'న్యూస్‌టుడే' కెమెరాకు చిక్కింది.

- న్యూస్‌టుడే, తుని గ్రామీణం

వైద్యనగర్‌లో సామాజిక స్థలానికి రెక్కలు

పరిశీలించిన పట్టణ ప్రణాళిక అధికారులు

సర్పవరం జంక్షన్, న్యూస్‌టుడే: కాకినాడ అర్బన్ 2వ డివిజన్ వైద్యనగర్‌లోని 101/1 తదితర సర్వే నంబర్లలోని సుమారు 94 సెంట్ల సామాజిక స్థలాన్ని నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళిక డీసీపీ హరిదాసు, ఏసీపీ నాగశాస్త్రులు, సర్వేయర్లు పరిశీలించారు. ఈ సామాజిక స్థలంలో సుమారు వంద గజాల స్థలానికి కొందరు నకిలీ దస్తావేజులు పుట్టించి మూడు ప్లాట్లుగా చూపించి చేజిక్కించుకోవడానికి ప్రయత్నాలు చేస్తూ కోర్టుకు వెళ్లారు. అదే సమయంలో స్థలం చుట్టూ కార్పొరేషన్ అధికారులు రక్షణ కంచె వేయడానికి చేస్తున్న ప్రయత్నాలకూ అవరోధాలు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు మంగళవారం ఆయా స్థలాలను పరిశీలించారు.



వైద్యనగర్‌లో సామాజిక స్థలాన్ని పరిశీలిస్తున్న కాకినాడ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు

28, 29 తేదీల్లో న్యాయవాదుల రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు

దానవాయిపేట(రాజమహేంద్రవరం): రాజమండ్రి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో షటిల్ బ్యాడ్మింటన్, చెస్, క్యారమ్స్ రాష్ట్రస్థాయి టోర్నమెంట్ ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ స్పోర్ట్స్, కల్చరల్ సెక్రటరీ కాశి శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్రవరం కాస్మోపొలిటన్, బార్ అసోసియేషన్ కార్యాలయం వేదికగా ఇవి జరుగుతాయన్నారు. ముఖ్యఅతిథిగా ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత హాజరై పోటీలను ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు సుప్రీంకోర్టు, హైకోర్టు, జిల్లా న్యాయవాదులు పాల్గొననున్నట్లు వెల్లడించారు.

29న బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపికలు

రామచంద్రపురం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జూనియర్ బాలబాలికల బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపిక 29న ఉదయం 9 గంటలకు రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జాతీయ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు ముప్పన వీరభద్ర స్వామి, కార్యదర్శి ఓలేటి సీతాపతిరావు తెలిపారు. 1 జనవరి 2005 తర్వాత పుట్టిన బాలబాలికలు అర్హులన్నారు. పుట్టిన తేదీ ధ్రువపత్రం నకలు, ఆధార్ కార్డుతో హాజరుకావాలన్నారు. డ్రెస్ కోడ్ తప్పనిసరని చెప్పారు. వచ్చే నెల 5 నుంచి 7 వరకు విశాఖ జిల్లా నునపర్తిలో జరగబోయే రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో బాలబాలికల జట్లు పాల్గొంటాయని తెలిపారు.

అండర్-14 ఫుట్‌బాల్ జట్ల ఎంపికలు వాయిదా

మసీదు సెంటర్ (కాకినాడ): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం కాకినాడ డీఎస్ఏలో నిర్వహించాల్సిన అండర్-14 ఫుట్‌బాల్ బాలబాలికల జట్ల ఎంపికలు వాయిదా వేశారు. వర్షం కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి లంకా జార్జి ఒక ప్రకటనలో తెలిపారు. మిగిలిన క్రీడలన్నీ షెడ్యూల్ ప్రకారం జరుగుతాయన్నారు.

సంకల్పసిద్ధి.. తీరం శుద్ధి



తాళ్లరేవు: కోరింగ అభయారణ్యం పరిధిలోని సముద్రం, గోదావరి తీరం శుభ్రంగా ఉండాలని తాళ్లరేవు పరిధిలో వన్యప్రాణి విభాగం అధికారులు, సిబ్బంది మంగళవారం సంకల్పించారు. ప్లాస్టిక్ ఇతర వ్యర్థాలను ఏరారు. వన్యప్రాణి విభాగ సిబ్బంది, కాకినాడ మెరైన్ ప్రొడక్ట్ ఎక్స్‌పోర్టు డవలప్‌మెంట్ అథారిటీ సభ్యులు సంయుక్తంగా గోదావరి తీరంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్.ఎస్.ఆర్.వరప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సముద్రం, గోదావరి తీరం వెంట పేరుకుపోయిన ప్లాస్టిక్ చెత్తను సేకరించారు. 400 కేజీల చెత్తను నావలపై ఒడ్డుకు చేర్చారు. జీసీఎఫ్ జిల్లా సమన్వయకర్త హర్ష, నాస్పీఏ సీఈవో డైహన్ కంగ్లమ్, ఎఫ్ఎస్‌వో వీరభద్రరావు, ఎఫ్‌డీవో గోపీనాగేంద్రకుమార్, మహేష్, ధనుంజయ, సుబానీ, ధనలక్ష్మి, మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం.. కాపాడిన మెరైన్ పోలీసులు



యువకుడిని రక్షించి తీసుకువస్తున్న పోలీసులు

సర్పవరం జంక్షన్: సూర్యారావుపేట సముద్రతీరంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడిని మెరైన్ హోంగార్డు పాల్ చాకచక్యంగా వ్యవహరించి రక్షించారు. మంగళవారం సాయంత్రం జరిగిన ఘటనపై వాకలపూడి మెరైన్ సీఐ రామ్మోహన్‌రెడ్డి వివరాల ప్రకారం.. సూర్యారావుపేటకు చెందిన గరికిన మసేన్ (27) ప్రేమ వివాహం చేసుకున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుని సముద్రతీరానికి వచ్చారు. నీటిలోకి దిగి ముందుకు వెళ్తుండగా అక్కడే విధుల్లో ఉన్న ఏఎస్సై మధుబాబు గుర్తించి సిబ్బందిని అప్రమత్తం చేశారు. మెరైన్ హోంగార్డు పాల్ లైఫ్ జాకెట్ సాయంతో హుటాహుటిన నీటిలోకి దూకి వేగంగా ఈతకొడుతూ మసేన్‌ను పట్టుకున్నారు. అనంతరం సురక్షితంగా తీరానికి తీసుకొచ్చి తిమ్మాపురం పోలీసులకు అప్పగించారు.

అప్పు తీర్చమంటే.. చంపుతామంటున్నారని ఫిర్యాదు

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: అప్పుగా తీసుకున్న సొమ్ము తిరిగి ఇవ్వాలని కోరుతూ కోర్టులో కేసువేసిన మహిళను చంపేస్తామని బెదిరిస్తున్న వ్యక్తిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు గొల్లప్రోలు ఎస్సై ఎన్.రామకృష్ణ తెలిపారు. గొల్లప్రోలుకు చెందిన కేదారిశెట్టి లావణ్య ఫిర్యాదుతో సూరకాసుల సత్యబాపిరాజుపై కేసు పెట్టినట్లు చెప్పారు. బాధితురాలి ఫిర్యాదు, ఎస్సై అందించిన వివరాల ప్రకారం.. లావణ్య భర్త గుప్త బెల్లం వ్యాపారం చేస్తారు. ఆయనలాగే బెల్లం వ్యాపారం చేసే సత్యబాపిరాజుకు రెండు విడతలుగా రూ.30 లక్షలు అప్పు ఇచ్చి తీర్చాలని కోరుతున్నా స్పందించకపోవడంతో రుణదాతలు కోర్టును ఆశ్రయించారు. విచారణ నిమిత్తం కోర్టుకు వెళ్లేటప్పుడు, ఆలయానికి వెళ్లి వచ్చేటప్పుడు, దుకాణంలో ఉండగా ఆయన వచ్చి కేసు ఉపసంహరించుకోకపోతే కిరాయి మనుషులతో చంపేస్తామని తనతో పాటు గుమస్తాను బెదిరిస్తున్నారని బాధిత మహిళ ఫిర్యాదు చేశారు. రుణ గ్రహీత నుంచి రక్షణ కల్పించాలని కోరారు.

శునకం దాడి.. వీఆర్వోకు గాయాలు

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: గొల్లప్రోలు ఎస్సీపేటలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ కరపత్రాలు పంచుతున్న సచివాలయం-1 వీఆర్వో కె.మంగతాయారుపై శునకం దాడిచేసింది. కుడికాలు మడమపై కరిచి తీవ్ర గాయం చేసింది. మంగళవారం ఉదయం సచివాలయ సిబ్బందితో కలిసి ఆమె కరపత్రాలు పంచుతుండగా ఒక్కసారిగా ఆమెపైకి శునకం ఎగబడి కరిచింది. బాధితురాలిని వెంటనే గొల్లప్రోలు పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమచికిత్స అనంతరం 108 అంబులెన్స్‌లో కాకినాడ జీజీహెచ్‌లో చేర్పించారు. వీఆర్వో మంగతాయారుపై దాడిచేసిన కుక్క గతంలో పలువురిని కరిచినట్లు స్థానికులు చెబుతున్నారు. కుక్కల బెడద తీవ్రంగా ఉందని, నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అదుపు తప్పిన బస్సు.. ప్రయాణికులు సురక్షితం

తొండంగి, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై ఓ ప్రైవేటు ట్రావెల్ బస్సు టైరు పంక్చర్ అవడంతో అదుపు తప్పి మరో మార్గంలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, ప్రయాణికులు తెలిపిన వివరాలిలా.. హైదరాబాదు నుంచి విశాఖపట్టణం వెళ్తున్న ఓ ప్రైవేటు ట్రావెల్ బస్సు మంగళవారం తెల్లవారుజామున బెండపూడి ఉన్నత పాఠశాల సమీపంలోకి వచ్చేసరికి టైరు పంక్చర్ అయ్యింది. దీంతో బస్సు ఒక్కసారిగా అదుపు తప్పి డివైడర్‌ను దాటి మరో మార్గంలోకి (అన్నవరం- కత్తిపూడి) వెళ్లి రహదారి పక్కనే నిలిచింది. ఆ సమయంలో ఆ మార్గంలో వాహనాలు ఏమీ రాకపోవడం, బస్సు నిలిచిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. లేకుంటే చాలా పెద్ద ప్రమాదం జరిగేదన్నారు. నలుగురు ప్రయాణికులు భయాందోళనకు గురై అద్దాల్లోంచి కిందికి దిగారని స్థానికులు తెలిపారు. ప్రయాణ సమయంలో డ్రైవర్‌తో సహా బస్సులో సుమారు 40 మందికి పైగా ఉన్నారు. ఆ బస్సు ముందుభాగం కొద్దిగా దెబ్బతింది. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాకపోవడంతో కేసు నమోదు చేయలేదని పోలీసులు తెలిపారు.

వైద్యుల నిర్లక్ష్యంతోనే మహిళ మృతి చెందారని ఆరోపణ

తుని: పట్టణంలోని వీరవరపుపేటకు చెందిన ఓ మహిళ వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి చెందిందని పలువురు ఆరోపిస్తున్నారు. తన కుమార్తె ప్రసవం కోసం ఎం.సత్యవతి (45) ఈనెల 20న ఏరియా ఆసుపత్రికి వచ్చి, రెండు రోజుల తర్వాత అనారోగ్యానికి గురై 23న మృతి చెందినట్లు చెబుతున్నారు. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో పలువురు ఆరోపిస్తున్నారు. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎస్.స్వప్నను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా తమకు ఏవిధమైన ఫిర్యాదు అందలేదన్నారు. ఈనెల 22న ఆమె అస్వస్థతకు గురికావడంతో మరో రోగి బంధువులు ఆ రోజు తెల్లవారుజామున అత్యవసర విభాగానికి తెచ్చారన్నారు. అప్పుడు విధుల్లో ఉన్న వైద్యులు, సిబ్బంది ఆమెకు చికిత్స అందించారన్నారు. వాంతులు, విరోచనాలు, కడుపునొప్పితో ఉన్న ఆమెకు ఆ తర్వాత వచ్చిన వైద్యులు కూడా చికిత్స చేశారన్నారు. అత్యవసర విభాగంలో సోమవారం ఉదయం 10 గంటల తర్వాత చికిత్స పొందిన ఆమెకు కొద్ది సమయంలోనే రెండుసార్లు గుండెపోటు రావడంతో మృతి చెందారన్నారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	10,000
పాతకాయ: గండేరా	16,500
గటగట	13,500
కొత్తకాయ: గండేరా	13,000
గటగట	10,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	13,000-16,000
కొత్త (పచ్చి) కాయ	14,000-17,500
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,000
కిలో	200

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	121-00
రిటైల్ లైవ్	143-00
డ్రెస్డ్	207-00
స్కిన్‌లెస్	236-00

కాకినాడ

రైతుబజార్‌లో నిన్నటి ధరలు(కిలోకు)

గాంధీనగర్: టమాటా - 25, 28, వంకాయలు - 40, 44, 60, బెండకాయలు - 22, పచ్చిమిర్చి - 30, 34, కాకరకాయ - 34, బీర - 32, 40, క్యాబేజీ - 30, క్యారెట్ - 32, దొండకాయలు - 20, 34, బంగాళాదుంపలు - 30, 36, ఉల్లి - 47, 57, గోరుచిక్కుళ్లు - 30, దోసకాయలు - 36, ఆనబకాయ - 35, 38, పొట్లకాయ - 18, 20, అరటికాయ - 6, 7, చిక్కుళ్లు - 66, 120, చేమదుంపలు - 46, మునగకాడలు - 10, 12, బీట్‌రూట్ - 32, కీరదోస - 32, బీన్స్‌కాయలు - 64, అల్లం - 52, క్యాప్సికం - 64, బొబ్బర్లు - 54, చిలకడదుంపలు - 56, మామిడికాయ - 15, 20, నిమ్మకాయలు(డజన్) - 36, 54.

సినిమాలు

గాంధీనగర్: ఆనంద్ సినిమాస్ 4(స్క్రీన్- చిక్కట్, 35, సరిపోదా శనివారం, హైడ్ ఎన్ సీక్, మత్తు వదలరా 2, దేవీ మల్టీప్లెక్స్ 4(స్క్రీన్- గొర్రె పురాణం, 35, సరిపోదా శనివారం, 100 కోట్లు, లక్ష్మీ- ట్రాన్స్‌ఫార్మర్స్ 1, సత్యగౌరి- గొర్రెపురాణం, తిరుమల - చిక్కట్, సిలంద్స్ 1- మత్తువదలరా 2, సిలంద్స్ 2- బొమ్మరిల్లు, శ్రీప్రియ - 100 కోట్లు(ఉ,సా), ఆయ్(మ,రా), పద్మప్రియ- సరిపోదా శనివారం, సూర్య1(వాకలపూడి)- గొర్రె పురాణం, సూర్య 2- సరిపోదా శనివారం, శ్రీశ్రీనివాసా(వేళంగి)- జర్నీ(ఉ)మత్తువదలరా 2.

జీజీహెచ్‌లో పొగాకు నివారణ ఓపీ ప్రారంభం



ఓపీని ప్రారంభిస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.లావణ్యకుమారి

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ జీజీహెచ్ ఓపీ భవనంలో పొగాకు నివారణ కేంద్రం ఓపీని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.లావణ్యకుమారి మంగళవారం ప్రారంభించారు. కేంద్ర మంత్రి నడ్డా వర్చువల్‌గా పొగాకు విరమణ కేంద్రాన్ని ప్రారంభించారని నిర్వాహకులు తెలిపారు. వైద్యులు రామచంద్రరావు, పి. సుజాత, కె.హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ముప్పుటేరుగా మార్చేస్తున్నారు..

ఉప్పుటేరు ఆక్రమణలతో ముంపు ప్రమాదం

న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

నగరంలోని ఉప్పుటేరు కాలువను కొందరు యథేచ్ఛగా ఆక్రమించేస్తున్నారు. ఇంత జరుగుతున్నా.. జలవనరులు, నగరపాలిక అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడటం లేదు. ఇదే అదునుగా అక్రమార్కులు కాలువను పూడ్చేస్తున్నారు. ఇంద్రపాలెం వంతెన, ఎన్టీఆర్ వారధి నుంచి వార్ఫురోడ్డు శివారు వరకు ఎక్కువగా ఆక్రమణలు కనిపిస్తున్నాయి.



బ్రహ్మంగారి మఠం వద్ద ఉప్పుటేరు కాలువను మట్టితో పూడ్చేశారిలా..

ఇలాగైతే వరద నుంచి రక్షణ ఎలా..?

భారీ వర్షాలు, వరదలు వస్తే నగరం ముంపు బారిన పడకుండా ఈ కాలువ కాపాడేది. కొన్నాళ్లు కుచించుకు పోతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇంద్రపాలెం వంతెన నుంచి పోర్టు వరకు సుమారు 3 కి.మీ మేర ఉన్న కాలువ ఇప్పటికే చాలాచోట్ల ఆక్రమణలకు గురైంది. వీటిలో నిర్మాణాలు వెలిశాయి. ఇప్పుడు మరింతగా బరితెగించి కాలువను మూసేస్తున్నారు. బ్రహ్మంగారి మఠం వద్ద ఉప్పుటేరు వద్ద ఆక్రమణలు పెరిగిపోయాయి. గతంలో వైకాపాకు చెందిన ఒక నేత సహకారంతో కాలువను మూసేసి స్థలం ఆక్రమించారు. ఇక్కడ ఇప్పుడు దుకాణాలు వెలుస్తున్నాయి.

ప్రవాహ గమనం మారి..

ఇప్పటికే నగరంలో మురుగు పారుదల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. ఎక్కడికక్కడ డ్రెయిన్ల అనుసంధానం అధ్వానంగా మారింది. ఇప్పుడు ఉప్పుటేరును కాపాడుకోకపోతే ముంపు తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గతంలో ఇంద్రపాలెం వంతెన వద్ద ఉప్పుటేరుపై ప్రైవేటు వ్యక్తులు భారీ వంతెన నిర్మించారు. దీంతో నీటి ప్రవాహం గమనం మారి పెనుముప్పుగా పరిణమిస్తోంది. ఈ కాలువ అవతల ఉన్న మేడలైన్‌లో భూములను వివిధ పార్టీలకు చెందిన పెద్దలు కొనుగోలు చేశారు. అక్కడ టౌన్‌షిప్ ఏర్పాటుకు అనుమతుల్లేకపోయినా వంతెన నిర్మించారు. దీని కారణంగానూ నగరం ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది.

ప్రతిపాదనలతోనే సరి..

ఉప్పుటేరును కాపాడి ముంపు నుంచి ప్రజలను రక్షించడానికి గత వైకాపా ప్రభుత్వంలో రూ.7 కోట్లతో రిటైనింగ్‌వాల్‌ను ప్రతిపాదించారు. స్మార్ట్‌సిటీ నిధులు వెచ్చిస్తామని చెప్పారు. తర్వాత దాని గురించి పట్టించుకోలేదు. అక్రమణల విషయాన్ని డిప్యూటీ సిటీ ప్లానర్ కె.హరిదాస్ వద్ద ప్రస్తావించగా.. ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే చర్యలు చేపట్టామన్నారు. అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

అందరి సహకారంతో ఉత్సవాలు



బాలాత్రిపుర సుందరి ఆలయ ఈవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఉండవల్లి వీర్రాజు చౌదరి

గాంధీనగర్, న్యూస్‌టుడే: కాకినాడ బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయ ఈవోగా బాధ్యతలు స్వీకరించడం తనకు దక్కిన అదృష్టమని ఉండవల్లి వీర్రాజు చౌదరి అన్నారు. సాధారణ బదిలీలో భాగంగా కాకినాడ జిల్లా చింతలూరు నూకాంబికా అమ్మవారి ఆలయ ఈవోగా పనిచేస్తూ ఇక్కడకు వచ్చారు. మంగళవారం ప్రస్తుత ఈవో చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలను అందరి సహకారంతో విజయవంతంగా నిర్వహిస్తామన్నారు. గతంలో సర్పవరం భావన్నారాయణస్వామి, కాకినాడ భానుగుడి భానులింగేశ్వరస్వామి, సంతచెరువు కనకదుర్గ ఆలయాలకు ఈవోగా పనిచేశానన్నారు. ఆయనకు ఆలయ ఉత్సవ కమిటీ ఛైర్మన్ గ్రంధి బాబ్జీతోపాటు, కూటమి నాయకులు అభినందనలు తెలియజేశారు.

పిచ్చిమొక్కలు, గడ్డి తొలగింపు



మసీదు సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: శాంతినగర్ పెద్దిరెడ్డివారివీధిలోని నగరపాలక సంస్థ పార్కు పిచ్చిమొక్కలతో అధ్వానంగా ఉండేది. గుబురుగా మొక్కలు పెరిగిపోవడంతో సందర్శకులు భయాందోళనకు గురయ్యేవారు. దీనిపై ఈ నెల 23న నిర్వహణ కొరవడి... నిరుపయోగంగా మారి శీర్షికతో వార్త ప్రచురితమైంది. సంబంధిత అధికారులు స్పందించి పార్కు ప్రాంగణంలోని పిచ్చిమొక్కలు, గడ్డిని తొలగించడంతో సమస్య పరిష్కారమైంది.

స్పందనకు వందనం

మేమున్నాం.. మీకు తోడుగా

వెలగని వీధి దీపాలు



సమస్య: టౌన్ రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారిలో హోండా షోరూం నుంచి వరుసగా వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి చీకటి కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

-రఘురామ్, విశ్రాంత రైల్వే ఉద్యోగి

సమాధానం: సిబ్బందిని పంపి వీధి దీపాలు వెలిగేలా చర్యలు చేపడతాం.

-సాంబశివరావు, ఏఈ, నగరపాలకసంస్థ

ఖాళీ స్థలంతో ఇబ్బందులు..

సమస్య: కాకినాడ శ్రీరామ్‌నగర్‌లో 1-18-17/1 డోరు నంబరు సమీపంలో ఖాళీ స్థలం ఉంది. అందులో నుంచి పాములు, గొంగళి పురుగులు, కీటకాలు ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయి. వర్షాల సమయంలో మరింత ఇబ్బంది పడుతున్నాం.

-స్థానికులు, శ్రీరామ్‌నగర్

సమాధానం: సిబ్బందిని పంపి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

-డా.పృథ్వీచరణ్, ఎంహెచ్ఓ, నగరపాలకసంస్థ

–న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

సంప్రదించాల్సిన ఫోన్ నంబరు: **91548 46719**

వంద రోజుల ప్రజా పాలన



ఎమ్మెల్యేకు రూ.లక్ష చెక్కు అందిస్తున్న దాతలు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో ప్రజాపాలన అందించిందని ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు(కొండబాబు) పేర్కొన్నారు. మంగళవారం స్థానిక అన్నదాన సమాజంలో 27, 28, 29, 31, 32 డివిజన్లకు సంబంధించి 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉప కమిషనర్ ఎస్.మనోహర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ నగరంలో వైకాపా ప్రభుత్వంలో భూ కబ్జాలు, ఆక్రమణలు జరిగాయన్నారు. వీటన్నింటిని సరిచేస్తామన్నారు. జిల్లా గృహనిర్మాణ అధికారి ఎన్‌వీవీ సత్యనారాయణ, తహసీల్దారు వి.జితేంద్ర, టీపీ ఆర్వో శైలజ, సీఐ వీవీ సత్యనారాయణ, తెదేపా నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి విరాళాలు ఇవ్వాలి

కాకినాడ నగరం: వరదలకు నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు సీఎం సహాయ నిధికి అందరూ సాయం చేయాలని ఎమ్మెల్యే కొండబాబు కోరారు. కాకినాడకు చెందిన తాళ్లూరి కనకరాజు, తాళ్లూరి రాజేష్, బాదం జయరామ్, అనంత, సంపత్, హర్ష తదితరులు సహాయ నిధికి రూ.లక్ష అందజేశారు. మంగళవారం ఆ చెక్కును ఎమ్మెల్యే కొండబాబుకు అందజేశారు.

సురక్షితంగా గమ్యస్థానాలకు చేరాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కాకినాడ డీఎస్పీ రఘువీర్ విష్ణు

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: విద్యార్థులంతా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరాలని కాకినాడ డీఎస్పీ రఘువీర్ విష్ణు అన్నారు. మంగళవారం కాకినాడ ట్రాఫిక్-1, 2 సీఐలు ఎన్.రమేష్, డి.రామారావు, వన్ టౌన్ సీఐ ఎం.నాగదుర్గారావు ఆధ్వర్యంలో ఆంధ్ర పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు.

నాయీబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడిగా వేపాడ ఎన్నిక



నియామకపత్రం అందుకుంటున్న అధ్యక్షుడు శ్రీనివాస్

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాకినాడ నగర నాయీబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడిగా వేపాడ శ్రీనివాస్ ఎన్నికయ్యారు. 20 ఏళ్లుగా సంఘానికి ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగాయి. ఈసారి పోటీ ఉండటంతో మంగళవారం అన్నదాన సమాజంలో రహస్య బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరిగాయి. వేపాడ శ్రీనివాస్, స్వయంభారపు శ్రీనివాసరావు అధ్యక్ష పదవికి పోటీ పడగా.. శ్రీనివాస్ విజయం సాధించారు. ఆయనకు సంఘ జిల్లా అధ్యక్షుడు కింతాడ సత్యనారాయణ నియామకపత్రాన్ని అందజేశారు. ఆయనకు తెల్లగ్రాపు లక్ష్మీగణేశ్, తానవరపు సాయి, ఆతంభద్రం, తస్నా రామారావు, తీడ మాణిక్యాలరావు, తాతపూడి శ్రీను, వేపాడి బాబ్జీ అభినందనలు తెలిపారు.

నగరపాలిక ఏసీపీగా వరహాలబాబు

కాకినాడ కలెక్టరేట్: కాకినాడ నగరపాలక సంస్థ అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా వి.వరహాలబాబును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీకాకుళం నగరపాలక సంస్థలో ఏసీపీగా పనిచేస్తున్న ఆయనను ఇక్కడ నియమించారు. ఇక్కడ ప్రస్తుతం డీసీపీ(ఎఫ్ఏసీ)గా పనిచేస్తున్న ఏసీపీ కె.హరిదాసును విశాఖపట్నం మహానగరపాలక సంస్థకు ఏసీపీగా బదిలీ చేశారు.

అవకాశాలను వినియోగించుకోవాలి

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: అందివచ్చిన అవకాశాలను వినియోగించుకుని జీవితంలో స్థిరపడాలని ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు విద్యార్థులకు సూచించారు. విజయనగరం రీజియన్ పరిధిలో ఎంపికైన ఐటీఐ అప్రెంటీస్ అభ్యర్థులు 24 మందిని జిల్లాకు కేటాయించారు. వీరందరికి కాకినాడ ఆర్టీసీ డిపోలోని డ్రైవింగ్ శిక్షణ కేంద్రంలో మంగళవారం అసిస్టెంట్ కమిషనర్ ఎంయూవీ మనోహర్ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

కరప: కరప-పెనుగుదురు రహదారిలో గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందినట్లు కరప పోలీసులు తెలిపారు. కరపలోని పెట్రోల్ బంక్ సమీపంలో మంగళవారం ఉదయం రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందినట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుని వద్ద లభించిన ఆధార్‌కార్డు ద్వారా బీహార్‌కు చెందిన మదన్‌కుమార్ సాహ్నీ (35)గా గుర్తించామని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. ప్రమాదంపై కేసు నమోదుచేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించామని పోలీసులు తెలిపారు.

చోరీయత్నం కేసులో కారాగార శిక్ష

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: సూపర్‌బజార్ కార్యాలయంలో రాత్రి పూట చొరబడి చోరీయత్నం చేసిన ఓ వ్యక్తికి రెండేళ్ల జైలు, రూ.5వేలు జరిమానా విధించారు. ఈ మేరకు కాకినాడ నాలుగో అదనపు జేఎఫ్‌సీఎం న్యాయమూర్తి నిరూప బాంజ్ డియో తీర్పు చెప్పారు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ మెయిన్‌రోడ్డులోని సూపర్ బజార్ కాంప్లెక్స్‌లో 2022 సెప్టెంబరు 22 రాత్రి నిందితుడు సూపర్ బజార్ కార్యాలయంలో ప్రవేశించాడు. దీనిపై సూపర్ బజార్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వాదోపవాదనల అనంతరం నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున జి.కమలకుమారి వాదించారు.

ఒకరికి జైలు...9 మందికి జరిమానా

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష, 9 మందికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారు. ఈ మేరకు కాకినాడ మూడో అదనపు సెకండ్ క్లాస్ జేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి వి.నరసింహారావు మంగళవారం తీర్పు చెప్పారు. కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదేశాల మేరకు నగర ట్రాఫిక్-1, 2 విభాగ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి 10 మందిపై కేసులు నమోదు చేసినట్లు సీఐలు ఎన్.రమేష్, డి.రామారావు తెలిపారు.

తల్లి మందలించిందని.. బాలిక ఆత్మహత్యాయత్నం

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: కాకినాడ గ్రామీణం స్వామినగర్‌కు చెందిన 17 ఏళ్ల బాలిక ఇంటి వద్దే ఉంటుంది. తరచూ చరవాణి చూస్తోందని తల్లి మందలించడంతో మనస్తాపం చెంది బ్లేడుతో చేతిపై కోసుకుంది. చికిత్సనిమిత్తం మంగళవారం జీజీహెచ్‌లో చేర్చారు.

ఆహారం... ఆరోగ్యం

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు

న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

అర్బన్ ప్రాజెక్టులో కేంద్రాలు:	253
గర్భిణులు:	1,952
బాలింతలు:	2,001
మూడేళ్లలోపు చిన్నారులు:	12,672
3-6 ఏళ్ల మధ్య వారు:	6,071

గర్భిణులు, బాలింతలు, బాలల్లో చాలా మందికి పోషకాహారం అందడం లేదు. ఫలితంగా అనారోగ్యం, రక్తహీనతతో బాధపడుతున్నారు. అలాంటి సమస్యలను అధిగమించేందుకు ఐసీడీఎస్ అధికారులు 'పోషణ్ మాహ్-2024' పేరుతో పోషకాహార మాసోత్సవం నిర్వహిస్తున్నారు. కాకినాడ అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది ద్వారా తల్లులు, చిన్నారులకు అవగాహన కల్పిస్తున్నారు. పోషకాహార లోపం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ కౌమార బాలికలు, బాలింతలు, గర్భిణులు తీసుకోవాల్సిన ఆహారంపై ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో సామూహిక సీమంతాలు చేస్తున్నారు.

చేపడుతున్న చర్యలు ఇలా..

✦ పోషకాహార లోపంతో బాధపడుతున్న వారిని గుర్తించి వారిని చైతన్యపరిచే బాధ్యతను ఐసీడీఎస్ సిబ్బంది తీసుకుంటున్నారు. చిన్నారుల్లో వయసుకు తగిన ఎత్తు, ఎత్తుకు తగిన బరువు లేకపోతే పోషకాహార లోపం ఉన్నట్లు గుర్తిస్తున్నారు. గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత కనిపిస్తే పోషకాహార లోపంతో ఉన్నారని తెలుసుకుంటున్నారు. ✦ ఆకుకూరలు, గుడ్లు, పాలు వంటివి తీసుకోవడం మానసికంగా, శారీరకంగా ఎలాంటి ఎదుగుల ఉంటుందో బొమ్మల సాయంతో వివరిస్తున్నారు.

✦ చిన్నారులకు ఆహారం ఒకేసారి కాకుండా ఎక్కువ సార్లు తక్కువ మొత్తంలో ఇవ్వడం వల్ల వారిలో తినే అలవాటు పెరుగుతుందని, వాటి వల్ల కలిగే ప్రయోజనాలు వివరిస్తున్నారు. ✦ వ్యక్తిగత, పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యమని అంగన్‌వాడీ సిబ్బంది ఇంటింటికి తిరిగి అవగాహన కల్పిస్తున్నారు.



పౌష్టికాహారంపై బాలికలకు అవగాహన కల్పిస్తున్న అధికారి

అవగాహన కల్పిస్తున్నాం

గర్భిణులు, తల్లులు, చిన్నారులను అనారోగ్య సమస్యలు దరి చేరకుండా ప్రభుత్వం పోషణ్ మాహ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ నెలంతా ఆరోగ్యపరంగా పలు కార్యక్రమాలు చేపడుతున్నాం. మహిళల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు అంగన్‌వాడీ కేంద్రాల్లో, ఇళ్ల వద్ద అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

-జ్యోతి, సీడీపీవో, కాకినాడ అర్బన్

వేధింపులకు పాల్పడిన ఉద్యోగిపై చర్యలేవీ..?

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: ఐసీడీఎస్ పరిధిలోని ఐసీపీఎస్ కార్యాలయంలో సోషల్ వర్కర్‌గా పనిచేస్తున్న యువతిని అదే కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగి లైంగికంగా వేధిస్తున్నారని భాజపా ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు ఎనిమిరెడ్డి మాలకొండయ్య ఆరోపించారు. ఆ ఉద్యోగిని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా నిందితుడిపై చర్యలు తీసుకోలేదన్నారు. బాధిత యువతితో కలిసి ఆయన మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉన్నతాధికారులు స్పందించి బాధితురాలికి న్యాయం చేయాలన్నారు. లేకుంటే భాజపా తరఫున ఉద్యమం చేస్తామన్నారు.

సుమలతకు జీవిత సాఫల్య పురస్కారం



సుమలతకు పురస్కారం అందజేస్తున్న ఎస్‌సీ ప్రతినిధులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూకే మాజీ రిజిస్ట్రార్ ఎల్.సుమలతకు కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కాంపిటెన్సీస్(సీఎస్‌సీ ఇండియా) జీవిత సాఫల్య పురస్కారాన్ని అందజేశారు. ఇంజినీర్ల దినోత్సవం సందర్భంగా ఈ పురస్కారాన్ని ప్రకటించగా, మంగళవారం సంస్థ ప్రతినిధులు జేఎన్‌టీయూకేలోని ఛాంబర్‌లో ఆమెకు పురస్కారాన్ని ప్రదానం చేశారు.

డీజీపీకి ఎస్సీ నేతల వినతి

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఇటీవల తలెత్తిన దళిత సమస్యలపై స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ కాకినాడకు చెందిన పలువురు ఎస్సీ నాయకులు మంగళవారం అమరావతిలో డీజీపీ ద్వారకా తిరుమలరావును కలిసి వినతి పత్రం అందజేశారు. మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పండు అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో డీజీజీని కలిసి సమస్యలు వివరించారు. పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరుపాడులో ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు అంబేడ్కర్ ఫ్లెక్సీని తొలగించి అగౌరవపరిచారన్నారు. కాకినాడ గ్రామీణ ఎమ్మెల్యే పంతం నానాజీ దళిత వైద్యుడు ఉమామహేశ్వరరావును దూషించిన ఘటనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని కోరారు. డీజీపీని కలిసిన వారిలో మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాతి శ్రీనివాసరావు, కాకినాడ, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల నాయకులు మూలే మేఘరాజు, జల్లి శ్రీనివాసరావు ఉన్నారు.

ఎన్ఎస్ఎస్ విద్యలో భాగం



మాట్లాడుతున్న యూసీఈకే ప్రిన్సిపల్ మోహనరావు

గాంధీనగర్, న్యూస్‌టుడే: జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) విద్యలో ఒక భాగమని యూసీఈకే ప్రిన్సిపల్ ఎన్.మోహనరావు అన్నారు. జేఎన్‌టీయూకే ప్రాంగణంలోని యూసీఈకే ప్రిన్సిపల్ కార్యాలయ సెమినార్ హాల్లో మంగళవారం వర్సిటీ యూనిట్-1, 2, 3ల సంయుక్త ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ జి.శ్యామ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.

✦ లక్ష్మీనారాయణనగర్‌లోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం మొక్కలు నాటారు. అకడమిక్ డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడు తదితరులు పాల్గొన్నారు. ✦ రామారావుపేటలోని సంజీవ్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో విద్యార్థులు మొక్కలు నాటారు.

అధికారులతో చర్చలు విఫలం

సాంబమూర్తినగర్(కాకినాడ): అంగన్‌వాడీ కేంద్రాల్లో అదానీ వాలంటీర్ల ప్రవేశాన్ని నిరసిస్తూ ఈ నెల 26న కాకినాడ కలెక్టరేట్ వద్ద తలపెట్టిన ధర్నా యథావిధిగా కొనసాగుతుందని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.చంద్రావతి తెలిపారు. మంగళవారం స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారులతో జరిగిన చర్చలు విఫలమయ్యాయని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అదానీ పరిశ్రమలు ఉన్న 15 కిలోమీటర్ల పరిధిలో అంగన్‌వాడీ సెంటర్లలో వాలంటీర్ల నియామకాన్ని వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. దీనిపై ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణతో యూనియన్ ప్రతినిధులు చర్చించినా ఎలాంటి సానుకూల స్పందన రాలేదన్నారు. చర్చల్లో సంఘ జిల్లా అధ్యక్షురాలు దడాల పద్మ, కోశాధికారి జి.రమణమ్మ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



చెరువులా రైల్వే ప్రాంగణం

కాకినాడ టౌన్ రైల్వేస్టేషన్ భానుగుడి వైపు రైల్వే ప్రాంగణం చిన్నపాటి చెరువును తలపిస్తోంది. సోమవారం కురిసిన వర్షానికి ప్రాంగణంలో నీరు నిలిచిపోయింది. రాకపోకల సమయంలో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ ప్రాంగణాన్ని ఏడాది క్రితమే తారుతో నిర్మించారు. ఇంతలోనే ఇలా రూపుమారడం గమనార్హం.

–న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్(కాకినాడ)



కొత్తమార్కెట్ ఫ్లైఓవర్ దిగువన పేరుకుపోయిన బురద



శాంతినగర్-సాంబమూర్తినగర్ ప్రధాన రహదారిలో ..

మురుగు ముంచెత్తింది..

కాకినాడలో సోమవారం కురిసిన భారీ వర్షానికి ప్రధాన రహదారులతోపాటు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మంగళవారం నాటికి నీరు తొలగిన తర్వాత పలు ప్రాంతాల్లో రోడ్లపై బురద తెట్టులా పేరుకుపోయింది. రాకపోకల సమయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొత్తపేట మార్కెట్ ఫ్లై ఓవర్ దిగువ, శాంతినగర్, సాంబమూర్తినగర్ ప్రధాన రహదారి, కొత్తకాకినాడ కూడలి వద్ద వర్షం కారణంగా మురుగు కాలువల్లో మురుగు రోడ్డుపైకి చేరింది. దీని కారణంగా దోమలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాలబారిన పడే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికప్పుడు కాలువల్లో పూడిక తొలగిస్తే ఇలాంటి సమస్య ఉండదని చెబుతున్నారు.

–న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్, మసీదు సెంటర్



లక్ష్మీనారాయణనగర్ వెళ్లే ప్రధాన రహదారిపై చేరిన మురుగు

కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

సామూహిక ఎలుకల నివారణ చేపట్టాలి

పెదపూడి, కాజులూరు: రైతులు సామూహిక ఎలుకల నివారణ చేపట్టాలని కాకినాడ ఏడీఏ ఎం.రత్న ప్రశాంతి, కాజులూరు మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. మంగళవారం దోమాడ, కాజులూరులో సామూహిక ఎలుకల నివారణ మందు పంపిణీ కార్యక్రమంలో వారు మాట్లాడారు. నారుమళ్ల దశ నుంచి సామూహికంగా ఎలుకల నివారణ చేపడితే పంటకు ఇబ్బంది ఉండదన్నారు. ఎలుకల నివారణకు ప్రభుత్వం ఉచితంగా మందు పంపిణీ చేస్తుందన్నారు. ఆత్మ పీడీ బీజీటీ చైర్మన్లు, వ్యవసాయాధికారి టి.వి.ఆర్.మణిదీప్ పాల్గొన్నారు.

మరిడమ్మ ఆలయ ఈవోగా విజయలక్ష్మి

పెద్దాపురం, న్యూస్‌టుడే: పెద్దాపురంలోని మరిడమ్మ అమ్మవారి ఆలయ ఈవోగా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ విజయలక్ష్మి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె రావులపాలెంలోని మల్లేశ్వరస్వామి దేవాలయం (శనీశ్వరుడు) నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. గతంలో 2019 నుంచి 2022 వరకు ఇక్కడే పనిచేశారు. పెద్దాపురంతో పాటు కాకినాడ ఎంఎస్ఎన్ ఛారిటీస్ అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇంతవరకు ఈవోగా పనిచేసిన సీహెచ్.రామ్మోహనరావు అన్నవరం సత్యనారాయణస్వామి దేవాలయానికి సహాయ కమిషనర్‌గా, ఏఈవోగా బదిలీపై వెళ్లారు.

మేమున్నాం.. మీకు తోడుగా

గుంతలు పూడ్చండి
సమస్య: చేబ్రోలు-మల్లవరం రోడ్డుపై గుంతలను పూడ్చి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టండి. చిన్నవిగా ఉన్న గుంతలు ఇటీవల వరదలకు పెద్దవవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. - **సుబ్రహ్మణ్యం, ఎ.కె.మల్లవరం**
సమాధానం: ఆ రోడ్డులోని గుంతలు పూడ్చేందుకు నిధులు మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరుకాగానే పనులు ప్రారంభిస్తాం. - **ఆర్.శిత, ఏఈ, ఆర్ అండ్ బీ శాఖ**
- న్యూస్‌టుడే, గొల్లప్రోలు

కాలువపై పలకలు ధ్వంసం
సమస్య: చానల్‌వీధిలోని కాలువపై పలకలు ధ్వంసమై ద్విచక్ర వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ప్రధాన రహదారి కావడంతో నిత్యం వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. - **అనిల్‌కుమార్, పెద్దాపురం**
సమాధానం: ఇంజినీరింగ్ సిబ్బందిని పంపించి కొత్త పలకలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. - **కేవీపద్మావతి, మున్సిపల్ కమిషనర్**
- న్యూస్‌టుడే, పెద్దాపురం

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబరు:
కాకినాడ గ్రామీణం: 80085 74325
పెద్దాపురం: 80085 74198
పిఠాపురం: 80085 65544


గొల్లప్రోలు శివారు నక్కలఖండి కాలువకు గండి


గండితో కోతకు గురైన పంట పొలం


వరి పొలాల్లోకి చేరిన ఇసుక

నక్కలఖండి.. కన్నీళ్లేనండీ..!

• కాలువకు గండితో కోతకు గురైన పొలాలు
• మేటల తొలగింపునకు ఆర్థికసాయం అందించాలని వినతి

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: భారీ వర్షాలు, ఏలేరు వరదలతో గొల్లప్రోలు శివారు నక్కలఖండి కాలువ గట్టుకు 40 మీటర్ల మేర భారీ గండ్లు పడ్డాయి. ఎదురుగా ఉన్న పంట పొలాలు కోతకు గురయ్యాయి. గండి ఎదురుగా పొలాలు మేటలు వేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరదలు తగ్గినా వారం రోజులపాటు గండి నుంచి నీటి ప్రవాహం కొనసాగింది. ఏలేరు వరదకు సార్వా వరిపంట నాశనం కావడంతో పాటు.. గండి కారణంగా రెండు ఎకరాల పొలం కోతకు గురై గుంతమయంగా మారింది. 10 ఎకరాల విస్తీర్ణంలో మేటలు వేశాయి. కోతకు గురైన పొలాన్ని పూడ్చి చదును చేసేందుకు ఎకరాకు రూ.2 లక్షలకు పైగా ఖర్చవుతుందని రైతులు చెబుతున్నారు. పొలాల్లో మేటల తొలగింపునకు అధికంగా ఖర్చవుతుందని వాపోతున్నారు. కాగా, నక్కలఖండి కాలువ గండి పూడ్చివేత పనులకు రూ.14.62 లక్షలు నిధులు మంజూరయ్యాయని, పనులు త్వరలో చేపడతారని జలవనరులశాఖ ఏఈ పద్మజ తెలిపారు.

3 నుంచి భువనేశ్వరి పీఠంలో దసరా ఉత్సవాలు

పెద్దాపురం: పెద్దాపురం పట్టణం వర్షులవారి వీధి భువనేశ్వరి పీఠంలో అక్టోబరు 3 నుంచి 12 వరకు దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పీఠం నిర్వాహకులు చింతా గోపి శర్మ సిద్ధాంతి తెలిపారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన భక్తులు పాల్గొంటారని, నవరాత్రుల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని వివరించారు.

సబ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు బదిలీ

పెద్దాపురం: పెద్దాపురం సబ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావును మలికిపురం కార్యాలయానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో జగ్గంపేటలో పనిచేస్తున్న విజయలక్ష్మిని నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

మున్సిపల్ డీఈఈగా ప్రకాశ్

పెద్దాపురం, న్యూస్‌టుడే: పెద్దాపురం పురపాలక సంఘం డీఈఈ ఆదినారాయణను కాకినాడ కార్పొరేషన్‌కి బదిలీ చేశారు. ఆయన స్థానంలో రాజమహేంద్రవరం కార్పొరేషన్ నుంచి ప్రకాశ్ డీఈఈ వస్తున్నారు.

సుపరిపాలనే కూటమి ప్రభుత్వ ధ్యేయం

కరప, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు సుపరిపాలన అందించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. కరపలో మంగళవారం తెదేపా నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావులతో కలిసి 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. వంద రోజుల్లో చేసిన అభివృద్ధి పనులు, ప్రజా ప్రయోజన కార్యక్రమాలను వివరించారు. గ్రామాల్లో అభివృద్ధి దిశగా అడుగులు పడుతున్నాయని సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నాయకత్వమే కారణమన్నారు. దీపావళి నుంచి మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీని ప్రారంభిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచి సాదే ఆశాజ్యోతి, తెదేపా నేతలు పెంకే శ్రీనివాసబాబా, కె.వి.ప్రభాకర్, సులువర్తి వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు బి.మురళి పాల్గొన్నారు.

కాజులూరు: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మంగళవారం గొల్లపాలెంలోని కల్యాణ మండపంలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వంద రోజుల్లో చేపట్టిన సంక్షేమ పథకాలు, తదితర అంశాలను ప్రజలకు వివరించారు. సర్పంచి ప్రసన్న మోనిక, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సామర్లకోట గ్రామీణం: ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి పేర్కొన్నారు. మండలంలోని పి.వేమవరంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం వారు మాట్లాడారు. ఎలిశెట్టి నాగరత్నం, భాజపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి వత్సవాయి వెంకటరమణ, సర్పంచి చీకట్ల వెంకటేష్, తెదేపా నాయకులు తోటకూర శ్రీనివాస్, గుమ్మళ్ల రామకృష్ణ, పాలకుర్తి శ్రీనివాస్, పెంకే వెంకటేష్, ముసిరెడ్డి రాంబాబు, అచ్యుతరామయ్య పాల్గొన్నారు.

తాళ్లరేవు: పోలేకుర్రులో తెదేపా నాయకుడు జక్కల ప్రసాదరావు, సీతారామపురంలో తెదేపా యువ నాయకుడు టేకుమూడి వీర వెంకట సత్యనారాయణ, కట్టిమేను పాపారావు, ఉప్పంగలలో సువర్ణలత, నీలం లోవరాజు, తాళ్లరేవులో తెదేపా నాయకులు కుడుపూడి దుర్గారావు, వాడపల్లి చిరంజీవి ఇంటింటికీ తిరిగారు. ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలు మంగళవారం పంపిణీ చేశారు.

పెదపూడి: కూటమి ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని మాజీ ఎంపీపీ జుత్తుక సూర్యకుమారి అన్నారు. మంగళవారం జి.మామిడాడలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అనంతరం విజన్-2047 పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచి లంక మున్ని, ఇన్‌ఛార్జి ఎంపీడీవో ఎం.సత్యనారాయణ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సీలు తమలంపూడి శివరామరెడ్డి, జుత్తుక సూరిబాబు, ఆర్.నాగు, జుత్తుక కృష్ణ పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దీక్షకు మద్దతుగా భాజపా కన్వీనర్ పితాని లీలావతి, కూటమి పార్టీల మహిళలు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. సర్పవరం జంక్షన్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని శుద్ధి చేశారు. బండి బోశిర్హ్న, గిరిజాల లక్ష్మీదేవి, మిరియాల హైమావతి, గడ్డలూరు యశోద, ఎర్రంరెడ్డి పద్మావతి పాల్గొన్నారు.

కొత్తపల్లి: రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని జనసేన పార్టీ ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఉప్పాడలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన మంచి పనులు వివరించారు. ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. జనసేన నాయకులు జ్యోతుల శ్రీనివాస్, పిల్లా శివశంకర్, మురాలశెట్టి సునీల్ కుమార్, మత్స్య అప్పాజీ, బందన నందిశ్వర, తెలగంశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


కాజులూరులో మాట్లాడుతున్న మంత్రి సుభాష్


కరపలో గోడపత్రికలతో ఎమ్మెల్యే నానాజీ, మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ


సామర్లకోట: పి.వేమవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చినరాజప్ప

లడ్డూ కల్తీ చేసినవారిని కఠినంగా శిక్షించాలి

పెదపూడి: తిరుపతి వెంకటేశ్వర స్వామి లడ్డూ కల్తీ చేసిన వారిని కఠినంగా శిక్షించాలని తెదేపా పెదపూడి గ్రామ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్డీఏ నాయకులు ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా తెదేపా రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి పుట్ట గంగాధర్ చౌదరి మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి లడ్డూను కల్తీచేయడం హిందువులందరిని అవహస్యం చేయడమేనన్నారు. దీంతో ఆలయ ప్రతిష్ఠ దెబ్బతింటుందన్నారు. దీనిపై పక్కాగా విచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. అనంతరం జగన్ దిష్టి బొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆరుమిల్లి అమ్మన్న చౌదరి, జుట్టుక కృష్ణ, సూర్యకుమారి, సానా కృష్ణ, కొటికలపూడి సత్తిబాబు, అమరాది రవి పాల్గొన్నారు.


పెదపూడిలో ఎన్డీఏ నాయకుల ధర్నా

క్రీడా మైదానాల అభివృద్ధికి కృషి

పెద్దాపురం, న్యూస్‌టుడే: క్రీడాకారులకు సాధనకు వీలుగా మైదానాల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్యే చినరాజప్ప చెప్పారు. పెద్దాపురం మహారాణి కళాశాల క్రీడా మైదానంలో ఈనెల 24 నుంచి 25 వరకు నిర్వహించే బాల, బాలికల నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎంఈవో ఈరంకి ప్రభాకరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజాసూరిబాబురాజు, నేతలు పాలకుర్తి శ్రీనుబాబు, గుమ్మెళ్ల రామకృష్ణ, కళాశాల కరస్పాండెంట్ జాస్తి రమేష్, ఎంపీపీ పెంకే సత్యవతి ప్రసంగించారు. క్రీడా ఉపాధ్యాయులు వరసాదనం, ఉమామహేశ్వరరావు, కామిరెడ్డి సుబ్రహ్మణ్యం, విశ్వేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ సోమేశ్వరరావు పాల్గొన్నారు.

రూ.3.49 కోట్ల నిధులు మంజూరు

పెదపూడి: మండలానికి రూ.3.49కోట్లు మహాత్మా గాంధీ ఉపాధి పథకం నిధులు మంజూరయ్యాయని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. మండలంలో 35 పనులకుగాను పెదపూడి, రామేశ్వరం, అచ్యుతాపురత్రయం, గండ్రేడు, పైన, జి.మామిడాడ, వేండ్ర, శహాపురం, కైకవోలు, కరకుదురు గ్రామాల్లో సిమెంటు రోడ్లు, మురుగునీటి డ్రైన్లు నిర్మాణాలకు మంజూరయ్యాయన్నారు. త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు.





పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

సామర్లకోట: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఐసీడీఎస్ సామర్లకోట బ్రౌన్‌పేట సెక్టారు పర్యవేక్షకురాలు మంగ పేర్కొన్నారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం పోషకాహారంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారం, వ్యాధి నిరోధక టీకాల అవసరత, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఆరోగ్యంపై ఆమె అవగాహన కల్పించారు. బ్రౌన్‌పేట పరిసర ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు.


ప్రదర్శనలో మహిళలు, బాలలు

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు

పెద్దాపురం, న్యూస్‌టుడే: కష్టపడి చదివిన వారు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు చేరుకుంటారని మహారాణి కళాశాల పూర్వ విద్యార్థి, విశ్రాంత డీజీ నార్ని శ్రీనివాసరావు చెప్పారు. కళాశాల వ్యవస్థాపకుడు ఎస్‌బీపీబీకే సత్యనారాయణరావు జయంతి సందర్భంగా మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తాను ఈ స్థితికి చేరుకున్నానంటే ఆనాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులే కారణమన్నారు. సమావేశంలో కరస్పాండెంట్ జాస్తి రమేష్, పాలకమండలి సభ్యుడు రాజాసూరిబాబురాజు, ప్రిన్సిపల్ డాక్టర్ జ్యోతిర్మయి, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు పసల పద్మరాఘవరావు ప్రసంగించారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలకు విశ్రాంత డీజీ బహుమతులు అందించారు. పూర్వ ప్రిన్సిపల్ ఆర్.ప్రభాకరరావు, విశ్రాంత అధ్యాపకుడు షేక్ ముస్తఫా, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విశ్రాంత డీజీ శ్రీనివాసరావు

జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

సామర్లకోట, న్యూస్‌టుడే: సామర్లకోటలోని బచ్చు ఫౌండేషన్ పురపాలక సంఘం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్‌కు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు తోటకూర సాయిరామకృష్ణ మంగళవారం తెలిపారు. నియోజకవర్గ స్థాయి పోటీల్లో ప్రతిభతో 11 మంది క్రీడాకారులు జిల్లాస్థాయికి అర్హత సాధించారన్నారు. అండర్-14 ఖోఖో విభాగంలో ఎం.శివ, గౌతమ్, కామేష్, అండర్-17లో జి రాకేష్, అండర్-14 కబడ్డీలో డి.రజిత, అండర్-17 కబడ్డీలో అభిరాం, కార్తిక్‌రెడ్డి, సాయిసత్య, మనోజ్, సూర్య ఎంపికయ్యారని వివరించారు. అండర్-14 అథ్లెటిక్స్‌లో 400 మీటర్ల పరుగులో ఆంజనేయ రెడ్డి ద్వితీయస్థానం సాధించాడని పేర్కొన్నారు. కోచ్ అజయ్, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు టి.వైకుంఠం, క్రీడాకారులను అభినందించారు.


జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

పవన్‌కల్యాణ్ దీక్షకు వీర మహిళల మద్దతు

పిఠాపురం, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారాన్ని నిరసిస్తూ ప్రాయశ్చిత్త దీక్ష ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దీక్షకు మద్దతుగా స్థానిక వీర మహిళలు మంగళవారం ఉప్పాడ బస్టాండ్ సెంటర్‌లో దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నెయ్యిలో పశువుల కొవ్వు కల్తీచేసి తిరుమల పవిత్రతను మంటగలిపారని ఆరోపించారు. శ్రీవారి ఆలయంలో జరిగిన తప్పులకు ప్రాయశ్చిత్త దీక్ష చేస్తున్నామన్నారు. దీక్షలో పాల్గొన్న వీర మహిళలకు జనసేన నాయకులు సంఘీభావం తెలిపారు.

తాళ్లరేవు: తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామి లడ్డూను అపవిత్రం చేయడాన్ని నిరసిస్తూ. . గుంటూరు జిల్లా నంబూరులో జనసేనాని, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మంగళవారం చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు తాళ్లరేవు మండల జనసైనికులు సంఘీభావం తెలిపారు. స్థానిక భూదేవి, శ్రీదేవి సమేత కేశవస్వామిస్వామి ఆలయంలో పార్టీ ఉభయగోదావరి జిల్లాల రీజినల్ సమన్వయకర్త ముత్యాల జయలక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం వేద పండితుల సమక్షంలో పూజా కార్యక్రమం నిర్వహించారు. సూరంపూడి కుమార్, పోతుల రాజు, చింతపల్లి రమేష్, వీర మహిళలు గిడ్డి రత్నశ్రీ, మంగతాయారు, శిరీష పాల్గొన్నారు.

పెద్దాపురం: మెయిన్‌రోడ్డు ఆంజనేయస్వామి దేవాలయం వద్ద బుధవారం ఉదయం 9 గంటలకు జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి ప్రాయశ్చిత్త దీక్ష చేయనున్నట్లు పట్టణ జనసేన పార్టీ అధ్యక్షుడు పొలమరశెట్టి సత్తిబాబు, పార్టీ నాయకులు కరారి శ్రీను తెలిపారు.


దీక్షలో జనసేన వీర మహిళలు


కేశవస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న జనసైనికులు

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

కరప: కరప-పెనుగుదురు రహదారిలో గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందినట్లు కరప పోలీసులు తెలిపారు. కరపలోని పెట్రోల్‌బంక్ సమీపంలో మంగళవారం ఉదయం రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందినట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుని వద్ద లభించిన ఆధార్‌కార్డు ద్వారా బీహర్‌కు చెందిన మదన్‌కుమార్ సాహ్ని (35)గా గుర్తించామని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. ప్రమాదంపై కేసు నమోదుచేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించామని పోలీసులు తెలిపారు.


మదన్‌కుమార్

వర్షంతో వీధులు జలమయం

సామర్లకోట, న్యూస్‌టుడే: సామర్లకోటలో మంగళవారం కురిసిన భారీ వర్షానికి పట్టణంలోని పలు ప్రాంతాల్లోని రోడ్లు, పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉదయం ఒక్కసారిగా కుండపోతగా అర గంట సేపు కురిసిన వర్షంతో ఎగువ ప్రాంతాల నుంచి నీరు ముంచెత్తింది. రైల్వేస్టేషన్ సెంటర్, రథం సెంటర్, గాంధీబొమ్మ కూడలి, మఠం సెంటర్, బళ్లమార్కెట్ తదితర ప్రధాన రోడ్లు, కూడళ్లలోకి నీరు చేరింది. ప్రధాన కాలువల్లో చెత్త పేరుకుపోవడం, స్టేషన్ సెంటర్‌లో డ్రైన్లు మూసివేయడం, హోటళ్లు, దుకాణాల వద్ద చెత్త, వ్యర్థాలను కాలువల్లో వేయడంతో వర్షపు నీరు పోయే మార్గం లేక చెత్త రోడ్లపైకి చేరింది. ఆర్టీసీ కాంప్లెక్స్ అధికారులు, సిబ్బంది కాలువల్లో చెత్తను తొలగించే పనులు చేపట్టి కాంప్లెక్స్‌లోని నీటిని బయటకు పంపారు.

పిఠాపురం: పిఠాపురంలో ఉదయం నుంచి మబ్బులు కమ్ముకున్నా మధ్యాహ్నం కుండపోతగా వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ప్రభుత్వాసుపత్రి ఆవరణంలోకి నీరుచేరి రోగులు, వారి బంధువులు అవస్థలెదుర్కొన్నారు. వస్త్రాద్‌వీధి, రథాలపేట సెంటర్లలో రోడ్లపై నీరు నిలిచింది. జగ్గయ్యచెరువు, మోహన్ నగర్, విద్యుత్తు నగర్‌లో రోడ్లు జలమయయమయ్యాయి.


వర్షంతో సామర్లకోట పొట్టి శ్రీరాములు పార్కు వద్ద పేరుకుపోయిన చెత్త

తుని

• తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

ఆకట్టుకున్న వంటల పోటీలు


తునిలో మెప్మా అర్బన్ మార్కెట్ ప్రదర్శన

తుని పట్టణం: పౌష్టికాహారంతో ఆరోగ్యంగా ఉండగలమని చాటిచెబుతూ పురపాలక సంఘ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో ఆహారపదార్థాల ప్రదర్శన నిర్వహించారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పోషకాలతో ఉన్న వంటల పోటీల్లో అనేక మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. మాజీ ఛైర్‌పర్సన్లు కుసుమంచి శోభారాణి, యినుగంటి సత్యనారాయణ విజేతలకు బహుమతులు అందించారు. మెప్మా సీఎంఎం శ్రీదేవి, ఆర్పీలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

జాతీయ స్థాయికి ఎదగాలి

శంఖవరం: జాతీయ స్థాయి లక్ష్యంగా పెట్టుకుని కృషిచేయాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. కత్తిపూడి ఉన్నత పాఠశాల వద్ద స్కూల్ ఫెడరేషన్ అఫ్ ఇండియా ఆధ్వర్యంలో రెండు రోజులు పాటు నిర్వహించే నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను మంగళవారం ఆమె జ్యోతి వెలిగించి ప్రారంభించారు. సుమారు 30 పాఠశాలల విద్యార్థులు ఈ క్రీడల్లో పాల్గొన్నారు. వెన్నా ఈశ్వరుడు, బద్ది రామారావు, పర్వత సురేష్, ఈసరపు సురేష్, పీఈటీ వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు.


వాలీబాల్ పోటీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

శ్రమజీవుల చెంతకు రక్షిత తాగునీరు

తుని, న్యూస్‌టుడే: పట్టణ శివారు ఉప్పరిగూడెం వాసులకు ఎట్టకేలకు రక్షిత తాగునీరు దరిచేరింది. శ్రమజీవులకు పూర్తిస్థాయిలో నీరందక అనేక ఇబ్బందులు పడుతున్నారని 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు పురపాలక అధికారులు, కౌన్సిల్ స్పందించి చర్యలు తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సుమారు రూ.20 లక్షల వ్యయంతో నిర్మాణం పూర్తి చేసిన రక్షితనీటి పథకం ట్యాంకు, 10 వీధి కొళాయిలను ఎమ్మెల్యే దివ్య ప్రారంభించి అందుబాటులోకి తెచ్చారు. కమిషనర్ ఎ.వెంకట్రావు, కౌన్సిలర్ రాసనబోయిన అప్పయమ్మ, సిద్ధాంతపు సత్తిబాబు, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు కథనానికి స్పందన


కొళాయి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దివ్య

మేమున్నాం.. మీకు తోడుగా

వీధిలైట్లకు మరమ్మతులు

జగ్గంపేట గ్రామీణం: రాజపూడి శివారుగ్రామం సీతారాంపురంలో వీధిలైట్లు వెలగకపోవడంతో కాలనీ వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి పి.వి.ఎస్.మూర్తి దృష్టికి తీసుకెళ్లగా వీధిలైట్లకు మరమ్మతులు చేయించారు. పలుచోట్ల కొత్త లైట్లు అమర్చినట్లు తెలిపారు.

పూడిక తీశారు..

రౌతులపూడి: రాఘవపట్నం గ్రామంలో ప్రధాన రహదారికి ఇరువైపులా కాలువల్లో పూడిక పేరుకుపోయింది. సమస్యను సర్పంచి రాయిపల్లి లోవరాజు, కార్యదర్శి ఎంపీఎస్ రెడ్డి వద్ద ప్రస్తావించగా వారు స్పందించారు. కార్మికులను పంపి కాలువల్లో పూడికను తొలగింపజేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

పారిశుద్ధ్యం అధ్వానం



శంఖవరం, న్యూస్‌టుడే: మండలంలోని కత్తిపూడిలోని కాలనీ వద్ద పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద పెద్ద ఎత్తున మురుగు నిల్వ ఉంటోంది. మురుగు పారేందుకు పూర్తి స్థాయిలో కాలువలు లేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి తమ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తుని: 9100020946, ప్రత్తిపాడు: 98669 62946 జగ్గంపేట: 80086 22066

అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిగా తీసుకోవాలి

జగ్గంపేట గ్రామీణం: ప్రజాసమస్యలపై అంకితభావంతో పనిచేసిన అమరవీరుల త్యాగాలను నేటితరం స్ఫూర్తిగా తీసుకోవాలని సిపిఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి చిట్టిపాటి వేంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. రామవరం భగత్‌సింగ్‌నగర్ కాలనీలో మంగళవారం చంద్రమ్మ, ముక్తార్‌పాషా వర్ధంతి సభ నిర్వహించారు. జిల్లా కార్యదర్శి ఎం.ఏసు, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు గుబ్బల ఆదినారాయణ, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

నీటి గలగల.. గట్టునే జీవన కళ!

జలయజ్ఞం స్ఫూర్తి.. సగరుల కాలనీ ఏర్పాటు

న్యూస్‌టుడే-ప్రత్తిపాడు

మండలంలో ఒమ్మంగి గ్రామంలో రాజు చెరువు ఇది. వేసవిలో తడి ఆరి ఎడారిలా ఉంటుంది. వర్షాలకు నీటి పంట పండింది. ఒమ్మంగి-శరభవరం రహదారిలో ఈ చెరువు గట్టూ 500 మీటర్ల మేర ఉంటుంది. దారి వెంబడే వెళ్తుంటే రాజు చెరువుకు మరో పక్క జనజీవనం సందడి. చెరువు అభివృద్ధి చెందిన నేపథ్యం గ్రామంలో స్ఫూర్తిగా కనిపిస్తుంది. 2000లో రాజు చెరువులో జలయజ్ఞం నీటి సంరక్షణకే కాదు గ్రామంలో ఓ కాలనీ ఏర్పాటుకు దోహదపడింది. ఈ తటాకంలోని తరాలుగా పేరుకున్న మట్టిని తొలగించి సమీపాన ఉన్న లోతట్టు ప్రాంతాన్ని ఎత్తు చేశారు. దీంతో ఇక్కడ సగరుల కాలనీ ఏర్పడింది. అప్పటివరకూ చెరువు సమీప ప్రాంతం పేదల ఇళ్ల స్థలాలుగా ఊరిస్తూనే ఉండేది. చెరువు పూడికతీత ఉభయతారకంలా మేలు చేసింది. అప్పటి ఎంపీపీ, ఒమ్మంగి గ్రామంలోని బీసీ నేత ములికి చినఅప్పారావు, మాజీ సర్పంచి రామిశెట్టి మురళిలు చెరువు పూడిక తీతకు శ్రమదానం చేసేలా చైతన్యపరిచారు. సుమారు 150 మంది కూలీలు నెల రోజుల పాటు పూడిక తీసి సమీపంలోని 9 ఎకరాలను ఎత్తు చేశారు. దీంతో కాలనీ ఏర్పాటై 183 మంది పక్కా గృహాలు నిర్మించుకునేలా చేసింది. ఏళ్ల తరబడి పూడికను తొలగించిన చెరువు ఊరి చివర మినీ జలాశయంగా మిగిలింది. సమీపంలోని కాలనీ జనసందడితో ఉంది. ఎండల్లో నెర్రలిచ్చినా వానొస్తే నీటిని నిలబెట్టి దిగువన ఉన్న ఆయకట్టు దిలాసాగా ఉండేలా చేస్తోంది. చెరువుకు చేటు చేయకుండా పరిరక్షించుకుంటే చాలు.. తరతరాలకు అదే మేలు!


వర్షాలకు ఒమ్మంగి రాజు చెరువు నిండా నీరు


చెరువు చెంత సగరుల కాలనీ మార్గం

సమాజహితమే లక్ష్యంగా శిబిరాలు

ఏలేశ్వరం, తొండంగి, న్యూస్‌టుడే : సమాజహితమే లక్ష్యంగా విద్యార్థులు పనిచేయాలని ఏలేశ్వరం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డి.సునీత, వైస్ ప్రిన్సిపల్ డి.చెన్నారావు అన్నారు. ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పీవో ప్రగడ ప్రయోగమూర్తి ఆధ్వర్యంలో మంగళవారం కళాశాలలో పలు కార్యక్రమాలను నిర్వహించారు. ప్రాంగణంలో మొక్కలు నాటి సంరక్షణకు అవసరమైన చర్యలను ఎన్ఎస్ఎస్ చేపట్టింది. కళాశాల స్థాయిలో ఉత్తమ సేవలందించిన వాలంటీర్లకు ప్రశంసాపత్రాలను, జ్ఞాపికలను ప్రిన్సిపల్ అందజేశారు. ఎన్ఎస్ఎస్ పీవో ప్రయోగమూర్తి, బాలబాలికల సేవలను సమావేశంలో అభినందించారు.

● విద్యార్థి దశలోనే ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవర్చుకోవాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మెహర్ అన్నారు. పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవం నిర్వహించారు.


మొక్క నాటుతున్న ప్రిన్సిపల్ సునీత, అధ్యాపకులు

డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో భోజనాలు

గండేపల్లి,(జగ్గంపేట)న్యూస్‌టుడే: జగ్గంపేటలో జనసేన ఆధ్వర్యంలో మంగళవారం డొక్కాసీతమ్మ క్యాంటీన్‌ను నిర్వహించినట్లు జనసేన ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్ తెలిపారు. ప్రతి మంగళవారం నిర్వహించే ఈ క్యాంటీన్‌ను ఈ వారం జనసేన నాయకుడు బాలు ఆర్థిక సాయంతో నిర్వహిస్తున్నామన్నారు.

భారీ వర్షం.. జనజీవనం అస్తవ్యస్తం

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ఆకాశం బద్దలైనట్టు భారీ వర్షం ప్రత్తిపాడులో మంగళవారం కురిసింది. గంట పాటు ఏకబిగిన వాన కురవడంతో వీధులన్నీ కాలువలుగా పారాయి. గతంలో కురిసిన వర్షాలకు మండలంలోని పలుచోట్ల పల్లపు ప్రదేశాల్లో నీరు ఇంకలేదు. కుండపోతగా కురవడంతో మళ్లీ జలమయం అయ్యాయి. విద్యార్థులు, ఉద్యోగులు ఇంటికి చేరే వేళ కావడంతో తడిసి ముద్దయ్యారు. ఈ వాన పంటలకు మేలు చేస్తుందని, మండలంలో పలుచోట్ల పూర్తి కుండా వదిలేసిన గంధలో రైతులకు ఇబ్బంది ఎదురైంది.

తుని పట్టణం, న్యూస్‌టుడే: తుని పరిసర ప్రాంతాల్లో మంగళవారం మధ్యాహ్నం వర్షం దంచికొట్టింది. ఒక్కసారిగా వాతావరణం చల్లబడి భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని ప్రకాశం రోడ్డు, నారాయణరాజుగారి వీధి, బాలాజీ రోడ్డు, జీఎన్‌టీరోడ్డు, కొండవారిపేట తదితర ప్రాంతాలు జలమయమయ్యాయి. రాకపోకలు సాగించే వారు నిలిచిన వర్షపునీటిలో తీవ్ర అవస్థలు పడ్డారు.


తునిలో కురుస్తున్న వర్షం

తొండంగి: మండలవ్యాప్తంగా మంగళవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలన్నీ వర్షం నీటితో నిండాయి.

అభివృద్ధే ధ్యేయంగా ముందుకు..

కిర్లంపూడి, న్యూస్‌టుడే : గడచిన ప్రభుత్వం ఐదేళ్లలో వ్యవస్థలన్నింటిని భ్రష్టు పట్టించారని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ధ్వజమెత్తారు. 'ఇది మంచి ప్రభుత్వం'లో భాగంగా ప్రజావేదిక కార్యక్రమాన్ని బూరుగుపూడిలో మంగళవారం నిర్వహించారు. ఎంపీపీ తోట రవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ.. సంక్షేమంతో పాటు, అభివృద్ధే ప్రధాన ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. వేదిక వద్ద జగ్గంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పోషకాహార ప్రదర్శనశాలను సీడీపీవో పూర్ణిమ ఆధ్వర్యంలో ఏర్పాటుచేశారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్, మండలపరిషత్ ఉపాధ్యక్షురాలు పెంటకోట సత్యవతి, నాయకులు చదరం చంటిబాబు, సత్తి గాంధీ, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నెహ్రూ, చిత్రంలో రమేష్

ప్రత్తిపాడు: 'పెద్దిపాలెంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే సత్యప్రభ ప్రజావేదిక మంగళవారం నిర్వహించారు. ప్రతి గ్రామం అభివృద్ధి చెందేలా పాలన సాగుతోందన్నారు. ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, తహసీల్దారు సూర్య ప్రభ, ఎంపీడీవో కుమార్‌బాబు పాల్గొన్నారు.

'ఇది మనందరి ప్రభుత్వం'

తుని, తొండంగి: ఇది మనందరి మంచి ప్రభుత్వమని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. పట్టణంలోని రామకృష్ణకాలనీలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. తుని పురపాలిక పరిధిలో రూ.6 కోట్లతో పలు పనులకు ప్రణాళిక చేశామన్నారు. ముందుగా రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. యినుగంటి సత్యనారాయణ, కుసుమంచి శోభారాణి, యనమల రాజేష్, తదితరులు పాల్గొన్నారు. ● నియోజక వర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే దివ్య అన్నారు. తొండంగి మండలంలోని పీఈ చిన్నాయిపాలెం, రావికంపాడు, కొమ్మనాపల్లి, సీతారాంపురం గ్రామాల్లో మంగళవారం ఇది మంచి ప్రభుత్వంలో ఆమె పాల్గొన్నారు. పీచిన్నాయి పాలెం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. రావికంపాడులో జడ్పీ పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు ప్రారంభమయ్యాయి. విద్యార్థులతో ఎమ్మెల్యే దివ్య మాట్లాడారు.

గండేపల్లి: ఆరు రోజుల పాటు 'ఇది మంచి ప్రభుత్వం' నిర్వహిస్తున్నామని ఎంపీడీవో వెంకటరామన్ తెలిపారు. ప్రతి గ్రామంలో సచివాలయ సిబ్బంది వారి పరిధిలో కుటుంబాలను సందర్శిస్తున్నారని ఆయన తెలిపారు.

నేడు గండేపల్లి, రౌతులపూడిల్లో..

గండేపల్లి(జగ్గంపేట), రౌతులపూడి: నేడు అర్బన్యా కల్యాణమండపంలో ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెదేపా నియోజకవర్గ ప్రచార కార్యదర్శి కొత్త కొండబాబు తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే నెహ్రూ, జనసేన ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్, భాజపా నాయకులు పాల్గొననున్నారన్నారు. ● లచ్చిరెడ్డిపాలెంలో బుధవారం 'ఇది మంచి ప్రభుత్వం' నిర్వహిస్తామని అధికారులు, నాయకులు తెలిపారు. ఎమ్మెల్యే సత్యప్రభ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు.

నాటిన ప్రతి మొక్కను సంరక్షిద్దాం

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతిమొక్కను వృక్షాలుగా పెరిగేవరకు సంరక్షిద్దామని సర్పంచి భూసాల విష్ణుమూర్తి అన్నారు. రాజపూడిలో స్వచ్ఛతహీ సేవా కార్యక్రమంలో భాగంగా చెరువుగట్లు, పంచాయతి స్థలాల్లో చెట్టు నాటే కార్యక్రమం చేపట్టారు. ఉపాధిహామి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతిక పద్ధతులపై రైతుల్లో చైతన్యం

ఏలేశ్వరం: సాగులో సాంకేతిక విధానాలను అనుసరించేలా రైతులను జాగృతం చేయాలని ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి సూచించారు. సిరిపురంలో పొలం పిలుస్తోందిలో భాగంగా స్థానిక శివాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సిబ్బంది తరచూ రైతులను కలిసి వారికి అండగా ఉండాలన్నారు. ఏవో బి.జ్యోతి, అధికారులు డి.శ్రీవల్లి, సంజీవ్ కుమార్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: వ్యవసాయం లాభసాటిగా మార్చేందుకు వారానికి రెండు రోజులు పాటు గ్రామాల్లో రైతులకు నూతన వ్యవసాయ విధానంపై అవగాహన కల్పించేందుకు అధికారులు పర్యటించేలా 'పొలం పిలుస్తోంది' అనే కార్యక్రమం చేపట్టిందని జిల్లా వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టరు బీవీఎస్‌సీ హరి వివరించారు. బూరుగుపూడిలో ప్రజావేదిక కార్యక్రమంలో పొలంపిలుస్తోంది గోడపత్రికలను ఎమ్మెల్యే నెహ్రూ వ్యవసాయాధికారుల సమక్షంలో ఆవిష్కరించారు. వ్యవసాయాధికారులు పెద్దాపురం ఏడిఏ దైవకుమార్, పెద్దాపురం డాట్ సెంటర్ కోఆర్డినేటర్ డా.ఎస్. దయాకర్, కీటక శాస్త్రం ప్రధాన శాస్త్రవేత్త పి.క్రాంతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం రామకృష్ణాపురం గ్రామంలో ఏడిఏ దైవకుమార్, ఏవో జోకా అమృత పంటపొలాల్లో ఎలుకల నివారణకు అవగాహన కల్పించి మందును పొలంగట్లపై ఏవిధంగా ఉంచాలన్న దానిపై అవగాహన కల్పించారు.


రామకృష్ణాపురంలో అవగాహన కల్పిస్తున్న ఏడిఏ దైవకుమార్, ఏవో అమృత

రౌతులపూడి: రౌతులపూడి రైతు సేవా కేంద్రం వద్ద వ్యవసాయ అనుబంధ రంగాల ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయాధికారి రెడ్డి ఈశ్వరరావు, పశువైద్యాధికారి ముద్రగడ వీరరాఘవరావు, తెదేపా నాయకులు పైల వేణుగోపాల్, ఇటంశెట్టి అశోక్, యర్రా వరహాలదొర తదితరులతో కలిసి పొలం పిలుస్తోంది గోడపత్రికలను అధికారులు ఆవిష్కరించారు.

జగ్గంపేట గ్రామీణం: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందు ప్రభుత్వం పలుకార్యక్రమాలు చేపట్టి రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందని వ్యవసాయాదికారి రెడ్ల శ్రీరామ్ అన్నారు. మామిడాడ, నరేంద్రపట్నం గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రాంతీయ పరిశోధనకేంద్రం శాస్త్రవేత్త శర్మ, రమేష్‌బాబు, రోనిక, సీతారామ శర్మ, హార్టికల్చర్ అధికారిని లావణ్య, ఫిషరీస్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, గ్రామ సర్పంచులు, రైతులు పాల్గొన్నారు. సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం :కాట్రావులపల్లి, రామవరం, ఇర్రిపాక, కాండ్రేగుల గ్రామాల్లో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం నిర్వహించినట్లు శ్రీరామ్ తెలిపారు.

తుని గ్రామీణం: రైతులసమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు మళ్లీ 'పొలం పిలుస్తోంది' కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మంగళవారం డి.పోలవరంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏడీఏ బుల్లిబాబు మాట్లాడుతూ.. కొత్త రకం వరి విత్తనాలతో రైతులకు కలిగే లాభాలను వివరించారు. మండల వ్యవసాయాధికారి అశోక్‌కుమార్, ఉద్యాన, మత్స్య, సెరీకల్చర్ తదితర శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

శంఖవరం: మండపం, శంఖవరం గ్రామాల్లో మంగళవారం పొలం బడి నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి గాంధీ పంటలను పరిశీలించి రైతులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. శంఖవరంలో జరిగిన కార్యక్రమంలో తెదేపా నాయకుడు పర్వత సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పంట సంరక్షణకు ఎలుకల నివారణ

గండేపల్లి: పంటను ఎలుకల నుంచి కాపాడుకునేందుకు మందును వాడాలని వ్యవసాయ అధికారి సద్గురుమూర్తి తెలిపారు. మంగళవారం యర్రంపాలెం లో ఎలుకల నివారణకు మందు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

తుని గ్రామీణం: వరి పొలాల్లో ఎలుకల నివారణ చర్యలు చేపట్టడంతో పంటకు జరిగే నష్టం తగ్గి రైతులు లాభపడతారని మండల వ్యవసాయాధికారి అశోక్‌కుమార్ తెలిపారు. కుమ్మరిలోవ గ్రామంలో మంగళవారం ఎలుకల నివారణ మందు వినియోగంపై క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించారు.


సిరిపురంలో మాట్లాడుతున్న ఎంపీపీ బుజ్జి

గుట్టుగా గ్రావెల్ దోచేస్తున్నారు..!

● అటు తరలింపు.. ఇటు కేసుల నమోదు

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే చర్యలపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజాప్రతినిధులు ఆదేశాలు జారీ చేసినప్పటికి గుట్టుచప్పుడు కాకుండా గ్రావెల్ తరలింపు కొనసాగడం అధికారుల పర్యవేక్షణ తీరుకు తార్కాణం. మండలంలోని కేవో మల్లవరం సమీపంలో రెవెన్యూ కొండ గ్రావెల్‌ను మంగళవారం ట్రాక్టర్లతో పెద్దఎత్తున తరలిస్తున్నారు. దీనికోసం ప్రత్యేకంగా జేసీబీ వాడడం గమనార్హం. ఇదే తీరుగా హంసవరం, హెచ్.కొత్తూరు గ్రామాల పరిధిలో కొండలను కొల్లగొట్టడంతో పాటు పోలవరం కాలువకు చెందిన గ్రావెల్‌ను తరలించడం సర్వసాధారణంగా మారింది. దీంతో రెవెన్యూ అధికారులు ఇటీవల గ్రావెల్‌ను తరలిస్తున్న ట్రాక్టర్లను అదుపులోకి తీసుకొని గనులశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికి ఈ అక్రమ తరలింపు కొనసాగడం విశేషం. ఈ విషయమై తహసీల్దారు ప్రసాద్ మాట్లాడుతూ.. అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నామని గడిచిన రెండు వారాల్లో గ్రావెల్ తరలిస్తున్న అయిదు ట్రాక్టర్లను, ఒక జేసీబీని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దీంట్లో మూడు ట్రాక్టర్ల యాజమానులకు రూ.1.50 లక్షలు వరకు గనులు, పోలవరం నీటిపారుదల శాఖ అధికారులు అపరాధ రుసుం విధించారన్నారు. అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వకాలు చేస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.


కేవో మల్లవరం సమీపంలో కొండ వద్ద యంత్రంతో గ్రావెల్ తవ్వుతూ..


హెచ్.కొత్తూరు నుంచి తరలిస్తున్న ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని...


కాగడాలతో జనసేన నాయకుల ప్రదర్శన

తిరుమల లడ్డూ కల్తీ.. బాధ్యులను కఠినంగా శిక్షించాలి

అన్నవరం, న్యూస్‌టుడే : తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగించి భక్తుల మనోభావాలు దెబ్బతీశారని జనసేన పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరుపుల తమ్మయ్యబాబు అన్నారు. జనసేన పార్టీ అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపడుతున్న 11 రోజుల ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా అన్నవరంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.

కిర్లంపూడి: తిరుమలలోని శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీనెయ్యి వాడడంపై తీవ్ర మనస్తాపానికి గురైన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత దీక్షకు మద్దతుగా కిర్లంపూడిలో జనసేన పార్టీ శ్రేణులు సంఘీభావంగా మంగళవారం దీక్షలు చేపట్టారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో కిర్లంపూడిలో పార్టీ నాయకులు యల్లపు రామ్‌ప్రసాద్(దొరబాబు), గంధం ప్రభాకర్ నందిబాబు తదితరులు మంగళవారం ఒకరోజు ఉపవాసదీక్షతో స్థానిక ప్రసన్నాంజనేయస్వామివారి ఆలయంలో పూజలు నిర్వహించారు.

విద్యుదాఘాతంతో ప్రమాదం

తుని పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని బాలాజీ రోడ్డులో ఓ ఇంట్లో మంగళవారం అగ్నిప్రమాదం సంభవించింది. ల్యాబ్‌పై ఉన్న ఇంట్లో ఉదయం 11 గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు వచ్చాయి. దట్టమైన పొగలు రావడంతో ఇంట్లో వారు ఆందోళనతో బయటకు వచ్చారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారి రాముడు సిబ్బందితో హుటాహుటిన అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో ఇంట్లో విలువైన సామగ్రి, గృహోపకరణాలు పూర్తిగా దగ్ధమయ్యాయి.

మార్చి 31 నాటికి ఇళ్ల నిర్మాణం పూర్తి

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: 'మన ఇల్లు-మన గౌరవం' కార్యక్రమంగా ఇప్పటికి వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణం మార్చి నాటికి పూర్తి చేయాలని ప్రత్యేక అధికారి, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ప్రత్తిపాడు మండల పరిషత్‌లో ఎంపీడీవో కుమార్‌బాబుతో కలిసి హౌసింగ్ తదితర శాఖల అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. పీఎంఏవై 1.0 మార్చి 2025 నాటికి ముగుస్తున్నందున ఇళ్ల నిర్మాణం పూర్తిచేసుకునేలా లబ్ధిదారులను చైతన్యపరచాలని ప్రత్యేక అధికారి సూచించారు.

విద్యార్థులకు ఫొటో పోటీలు

తుని పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులకు ఫొటో పోటీలు నిర్వహిస్తున్నామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు జి.రాము తెలిపారు. ఒక్కో విద్యార్థి ఒక్క ఫొటో మాత్రమే (స్వయంగా తీసింది) అక్టోబరు 13వ తేదీలోపు 7893741611 నెంబరుకు వాట్సాప్ ద్వారా పంపాలని సూచించారు. ఎంపికైన ఫొటోను ప్రింట్ వేసి ప్రదర్శించడంతోపాటు విజేతలకు బహుమతులు ఇస్తామన్నారు.

దళితులకు రక్షణ కల్పించాలి

ఏలేశ్వరం: తహసీల్దారు కార్యాలయం వద్ద ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి, దళిత సంఘాల ఐకాస మంగళవారం ధర్నా నిర్వహించింది. కార్యక్రమంలో గునుపూడి కొండబాబు, నూకతాటి సతీష్‌కుమార్, టి.బాబులు తదితరులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. కాకినాడ ఆర్ఎంసీ స్పోర్ట్స్ వైస్ ఛైర్మన్ ఉమామహేశ్వరరావుని దుర్భాషలాడి దాడి చేసిన కాకినాడ గ్రామీణ ఎమ్మెల్యే పంతం నానాజీ, అంబేడ్కర్‌ని అవమానించిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజుపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు.

వరదనీటికి ప్రత్యేక కాలువ అవసరం

● ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

కిర్లంపూడి, జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ఏలేరు ఆధునికీకరణను ప్రభుత్వం రెండు దశలుగా చేపట్టనుందని జలవనరులశాఖ సీఈ ఎన్.పుల్లారావు తెలిపారు. దెబ్బతిన్న గట్లు, సాగునీటి నిర్మాణాలను ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూతో కలిసి అధికారులు మంగళవారం పరిశీలించారు. ఏలేశ్వరం మండలం తిరుమాలి గ్రామం, జగ్గంపేట మండలం ఇర్రిపాక గ్రామాల మధ్య ఏలేరు ప్రధాన కాలువపై ఆధునికీకరణలో భాగంగా రూ.ఎనిమిది కోట్లతో నిర్మించిన గ్రోయిన్ ఏలేరు వరదలకు పూర్తిగా ధ్వంసమైంది. ఇర్రిపాక గ్రామంవైపు గట్టు పూర్తిగా కొట్టేయడంతోపాటు గట్టును ఆనుకుని ఉన్న సుమారు ఎకరం పొలం కోతకు గురై అగాధంలా ఏర్పడింది. సీఈ పుల్లారావు, ఎస్ఈ శ్రీనివాసరావు, ఈఈ శేషగిరిరావులకు ఎమ్మెల్యే నెహ్రూ జరిగిన నష్టాన్ని వివరించారు. ముక్కలైన గ్రోయిన్ వింగ్‌వాల్ ఇతర నిర్మాణాలను పరిశీలించారు. ఇర్రిపాక గ్రామం రక్షణ కోసం చేపట్టిన ఎర్త్ బండ్ నిర్మాణ పనులను అధికారులు పరిశీలించారు. ఎస్.తిమ్మాపురం, గెద్దనాపల్లి, ముక్కొల్లు రెగ్యులేటర్ల పరిస్థితులు, కాలువలకు పడ్డ గండ్లను అధికారులు పరిశీలించారు.


ముక్కొల్లులో ప్రధాన కాలువకు పడ్డ గండిని పరిశీలిస్తున్న సీఈ పుల్లారావు, ఎస్ఈ శ్రీనివాసరావు ఇతర అధికారులు

ఆయకట్టుకు సాగునీరు పారేలా ఆధునికీకరణ

ఏలేరు ప్రాజెక్టు నుంచి లక్ష క్యూసెక్కుల వరద నీరు సముద్రంలో కలిసేలా ప్రస్తుతం ఉన్న కాలువను వరద కాలువగా విస్తరింపజేసి, ప్రాజెక్టుపై ఆధారపడ్డ 57వేల ఎకరాలకు ప్రాజెక్టు డీసీఆర్ స్లూయిజ్ నుంచి పంట కాలువలు ఏర్పాటు చేస్తేనే ఈ ప్రాంతానికి వరద ముప్పు నుంచి శాశ్వత పరిష్కారమని ఎమ్మెల్యే నెహ్రూ వివరించారు. ప్రాజెక్టు చెంతన ఉన్న తిమ్మరాజు చెరువును మినీ రిజర్వాయర్‌గా మలిచి దానినుంచి మొత్తం ఆయకట్టుకు సాగునీరు పారేలా ఆధునికీకరణలో భాగంగా పంట కాలువలు ఏర్పాటుచేయాలని ఇంజినీర్లను ఎమ్మెల్యే కోరారు.

రూ.3.85 లక్షల రికవరీకి ఆదేశాలు

గోకవరం: ఉపాధి హామీ పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో పలు అవకతవకలను గుర్తించి సిబ్బంది నుంచి రూ.3.85 లక్షలు రికవరీకి అధికారులు ఆదేశించారు. డ్వామా ఏపీడీ బి.రాంప్రసాద్ ప్రిసైడింగ్ అధికారిగా ఎంపీపీ కార్యాలయం వద్ద మంగళవారం ప్రజావేదికను నిర్వహించారు. గత ఆర్థిక సంవత్సరంలో మండలంలో రూ.15.67 కోట్లు ఉపాధి హామీ కింద ఖర్చు చేశారు. ఈ పనుల తనిఖీల్లో తేడాలను గుర్తించి రికవరీకి ఆదేశించినట్లు ఎస్ఆర్‌పీ తులసీనాయక్ తెలిపారు. అంబుడ్స్‌పర్సన్ ఎస్.ఖాదర్‌బాషా, పీఆర్ జేఈ అబ్బాయిదొర సిబ్బంది పాల్గొన్నారు.

పనుల్లో తేడాలు తేడాలెక్కడ	రికవరీ సొమ్ము (రూపాయల్లో..)
మస్తర్లు కొట్టివేతలు	14,500
కొలతల్లో తేడాలు	28,600
మొక్కల పెంపకంలో	62,450
బినామీ మస్తర్ల రికవరీ	58,320
మినీ గోకులాల రికవరి	64258
రోడ్లు, భవన పనుల్లో..	1,58225